




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 54 | ది. 28-5-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 54 | Date : 28-5-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |


# టీడీపీ పనిచేసేది ఎన్నికల కోసం కాదు... నెక్స్ట్ జెనరేషన్ కోసం

- జెన్ జీ, జెన్ ఆల్ఫాకు విస్తృత అవకాశాలు... అందిపుచ్చుకోండి
- రాష్ట్రాన్ని 5 ఏళ్లు విధ్వంసం చేస్తే... రెండేళ్లలో గట్టెక్కించాం
- రక్తచరిత్ర రాసేవాళ్లు స్వర్ణాంధ్ర చరిత్ర రాయలేరు
- గొడ్డలి పార్టీకి గోల్ లేదు... అదొక అడ్డగోల్ బ్యాచ్
- మహానాడు సభలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ప్రభుత్వ విజయాలు, పార్టీకి నిర్దేశంతో సాగిన సీఎం ప్రసంగం
- మహిళల పోరాటాలకు గౌరవంగా మహానాడు అంకితం





**అమరావతి,మే 27 (వార్తాప్రభ) :** ఎన్నికల కోసం కాదు, భవిష్యత్ తరాల కోసం పనిచేస్తోన్న పార్టీ తెలుగుదేశం అని... గత పాలకులు రాష్ట్రాన్ని ధ్వంసం చేస్తే... రెండేళ్లలో రాష్ట్రాన్ని గట్టెక్కించి, వ్యవస్థలను గాడిలో పెట్టి, ఏపీ బ్రాండ్ ఇమేజ్ తిరిగి తీసుకువచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టేలా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పనిచేసిందని చెప్పారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నామన్నారు. మహిళల సాధికారత, రాష్ట్రానికి పెట్టుబడులు - యువతకు అవకాశాలు, ప్రతీ ఎకరానికి సాగునీరు, అద్భుత రాజధానిగా అమరావతి నిర్మాణం, పేదవారికి సైతం అత్యుత్తమ వైద్యం, అందరికీ చదువు, అసమానతలు రూపుమాపడం, స్వర్ణాంధ్రను సాధించడమే టీడీపీ లక్ష్యమని... ప్రజలు ఇచ్చిన అఖండ విజయానికి సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలనతో రుణం తీర్చుకుంటున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయం వేదికగా బుధవారం జరిగిన మహానాడు సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలు, పార్టీకి దిశా నిర్దేశంతో సీఎం ప్రసంగం సాగింది. రెండు రోజుల పాటు సాగే వర్చువల్ మహానాడుకు భారీ స్పందన వచ్చింది. మహానాడు ప్రారంభ సమయంలోనే భారీగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. 1,864 క్లస్టర్ల నుంచి దాదాపు 2.23 లక్షల మంది మహానాడు కార్యక్రమానికి హాజరయ్యారు. వర్చ్యువల్ మీటింగ్‌పైన కార్యకర్తలు ఎంతో ఆసక్తి కనబరిచారు.

**కార్యకర్తల్లో జోష్ తగ్గలేదు..** జై తెలుగుదేశం నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి... వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ, కార్యకర్తల్లో జోష్ తగ్గలేదన్నారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహించుకుంటున్నామని, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా మహానాడును ఈసారి హైబ్రీడ్ పద్ధతిలో జరుపుతున్నామని చెప్పారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప... మహానాడు విధానం మారలేదన్నారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో ఆవిర్భవించిన టీడీపీ... విజన్ పాలిటిక్స్‌కు రూపం ఇచ్చిందన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారికి ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసంగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, ధైర్యం, భరోసా కలుగుతుందన్నారు. నాటికి, నేటికి తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో ఆదరణ మాత్రం చెక్కు చెదరలేదన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు ఎదురైనా ప్రజల కోసం 45 ఏళ్లుగా టీడీపీ పోరాటం చేస్తూనే ఉందన్నారు. నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగు దేశం జెండాను మాత్రం వదలకుండా అభిమానం చూపారన్నారు. చంద్రయ్య లాంటి కార్యకర్తను ప్రత్యర్థి పార్టీల వారు నరుకుతున్నా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తనను కూడా అక్రమంగా జైల్లో పెట్టారని, లోకేష్ యువగళాన్ని అడ్డుకున్నారని, ఎంతోమంది పార్టీ నేతల్ని, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెట్టి అరెస్టు చేశారని వివరించారు. బాధితుల్నే నిందితులుగా చేసినా ఏ టీడీపీ నాయకుడూ, కార్యకర్తా వెనకడుగు వేయలేదని కొనియాడారు. ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు 2024 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడ్డామని... ప్రజలు ఆదరించి, ఆశీర్వదించారని చెప్పారు.

**మొన్నటి విజయంలో మహిళలదే కీలక పాత్ర..** 'మహిళా సాధికారిత కోసం, సామాజిక, ఆర్ధిక రాజకీయ గౌరవం కోసం ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక నిలబడుతుంది. విద్య, ఉద్యోగం, ఉపాధికి ఆర్ధికంగా మహిళలకు వెసులుబాటు ఇచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. దీపం 2.0 పథకం ద్వారా ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు ఇస్తున్నాం. గత ఏడాది లక్ష మంది మహిళల్ని ఎంట్రప్రెన్యూర్‌లుగా తీర్చిదిద్దాం. మరో 5 లక్షల మంది మహిళల్ని ఎంట్రప్రెన్యూర్లుగా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. స్వయం ఏపీ పేరుతో డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం. మొన్నటి విజయంలో మహిళలదే కీలక పాత్ర. ప్రజా క్షేత్రంలో పోరాడి పార్టీని గెలిపించారు. అందుకే ఈ మహానాడును ఆడబిడ్డలకు అంకితం చేసేలా మహిళా మహానాడుగా ప్రకటిస్తున్నాం.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తాం..** యువత గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... 'ఏ పాలసీ చేసినా అది యువత కోసమే చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ పాలసీతో యువతకు ఉద్యోగాలు వచ్చాయి. ఎన్నికల సమయంలో ప్రస్తుత టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాష్ట్రమంతటా పర్యటించి యువగళం పాదయాత్రలో హామీలు ఇచ్చారు. దానికి అనుగుణంగా జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆలోచనలకు అనుగుణంగా విధానాలు రూపొందించి అవకాశాలు కల్పిస్తాం, సహకారం అందిస్తాం. ఏఐ, క్వాంటం, స్పేస్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ ఇలా అన్ని రంగాల్లో ఏపీ చిరునామాగా ఉంటుంది.

# వేగవంతంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

## -రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుల పురోగతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివరించిన సి.ఎస్.





**అమరావతి,మే 27 (వార్తాప్రభ) :** ముద్ఖేడ్--మెద్చల్--మహబూబ్‌నగర్--ధోన్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పరిధిలో భూసేకరణ, ప్రభుత్వ భూముల బదలాయింపు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి వివరించారు. బుధవారం డిల్లీ నుండి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన ప్రగతి వీడియో కాన్ఫరెన్సులో దేశవ్యాప్తంగా వివిధ కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు, జాతీయ పథకాల అమలు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మాట్లాడుతూ ధోన్--మహబూబ్‌నగర్ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 23.07 హెక్టార్ల ప్రైవేట్ భూమి సేకరణ అవసరమైందని, దీనికి సంబంధించిన సెక్షన్ 20(ఎ) నోటిఫికేషన్ 25.09.2025న జారీ చేసినట్లు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో 18.21 హెక్టార్ల భూమి 4 మండలాల్లోని 16 గ్రామాల్లో అవసరమైందని, అందులో 8 గ్రామాల్లో రైల్వే అధికారుల సహకారంతో పెగ్ మార్కింగ్ పూర్తయ్యిందని, మిగిలిన గ్రామాల్లో ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మరో రెండు వారాల్లో 20(ఈ) నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో అవసరమైన 4.86 హెక్టార్ల భూమికి సంబంధించిన పెగ్ మార్కింగ్ పూర్తి కాగా, 20(ఈ) నోటిఫికేషన్ ఇప్పటికే జారీ చేసినట్లు ప్రధాన కార్యదర్శి వివరించారు. అలాగే, మొత్తం 4.05 హెక్టార్ల ప్రభుత్వ భూమి బదలాయింపుకు సంబంధించి, రైల్వే అధికారులు అధికారిక రిక్విజిషన్ సమర్పించిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్లు అడ్వాన్స్ పొజెషన్ ఇవ్వనున్నట్లు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ వివరించారు.


IN THE COURT OF MACT - XIII ADJ, VIJAYAWADA
MVOP NO.60/2025

Between :-
గొరిపర్తి వెంకటలక్ష్మి మరియు ఇతరులు
------Petitioners
And
ఎల్లనూరు నరశేఖర్ మరియు ఇతరులు
----Respondents

To.
1. ఎల్లనూరు నరశేఖర్ S/o సుబ్బనరసింహుడు లారీ డ్రైవర్ AP39UV0411, D.NO.1-158, Yallanur V&M అనంతపురం జిల్లా - 505 465
--------రెస్పాండెంట్-1
2. నాయగళ్ళ మద్దిలేటి S/o Prakasam, Owner of lorry AP 39 UV 0411, D.No.8/113/1, రామకృష్ణాపురం, బనగానపల్లె (V) బేతంచర్ల (M) నంద్యాల, A.P. - 518 599
--------రెస్పాండెంట్-2

పై దావాలో మీరు ప్రతివాదులై ఉన్నారు. ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీకు చేరుట లేదు. కావున శ్రీ కోర్టు వారు ప్రత్యామ్నాయంగా ఈ పేపరు ప్రకటన ద్వారా/ప్రచురితం ద్వారా మీకు సమన్లు అర్ధరు చేయుచున్నారు. కావున ది.22-6-2026 ఉ॥ 10.30ని.లకు మీరు గాని లేదా మీ యొక్క న్యాయవాదులు కాని హాజరు కావలసినదిగా తెలియచేయడమైనది. లేని యెడల మీ పరోక్షముగ తీర్మానించబడును. (శ్రీ కోర్టు వారి ఆదేశాను సారం)

ఇట్లు
T.UMA MAHESWARA RAO. M.A., B.L.,
Advocate
Vijayawada-8
Cell : 98490 58922

విజయవాడ
తేది: 27-5-2026







# రిజిస్ట్రేషన్ల రద్దీకి చెక్

- ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు
- మే 29 నుంచి జూన్ 3 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు
- ఉదయం 9:30 నుంచి రాత్రి 7:30 వరకు సేవలు
- అవసరమైతే మరిన్ని రోజులు, మరింత సమయం కూడా పెంచుతాం
- ప్రజల సౌకర్యమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్,మే 27 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో భూముల విలువలను వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా క్రమబద్ధీకరించాలన్న రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయంతో రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్ పెరిగిన నేపథ్యంలో... ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పని వేళలను ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఌ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకూడదని, ఎవరూ ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. "ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ధ్యేయం... రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగం, పారదర్శకత, సౌకర్యం మూడు ప్రధాన లక్ష్యాలు" అని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే అదనపు సమయంతో పాటు మరిన్ని రోజులు కూడా పని వేళలను పొడిగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. అలాగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగే తహసీల్దార్ కార్యాలయాలతో సమన్వయం పెంచి... ఎక్కడా ఆలస్యం లేకుండా సేవలు అందించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, సౌకర్యవంతమైన సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని రాష్ట్ర రిజిస్ట్రేషన్ల ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

# ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్ధవంతంగా చేరవేస్తా

- ప్రతి బాధ్యత తనకు ఒక కొత్త అనుభవాన్ని నేర్పింది
- అదనపు సంచాలకులు (ఇంచార్జి) గా నియమితులైన పోతుల కిరణ్ కుమార్





**విజయవాడ,మే 27 (వార్తాప్రభ) :** అధికారులు తనకు కల్పించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగానని, సమాచార శాఖలో నిర్వర్తించిన ప్రతి బాధ్యత తనకు కొత్త అనుభవాన్ని, విలువైన పాఠాలను నేర్పిందని అదనపు సంచాలకులు (ఇంచార్జి) గా నియమితులైన పోతుల కిరణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం జాయింట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న పి.కిరణ్ కుమార్ సేవలను గుర్తించిన ప్రభుత్వం, ఆయనకు అడిషనల్ డైరెక్టర్ (ఇంచార్జి) గా పదోన్నతి కల్పించిన నేపథ్యంలో బుధవారం విజయవాడలోని ఎన్టీఆర్ పరిపాలనా భవనంలో ఉన్న కమిషనర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

**అనుభవమే నాకు పాఠం:** ఈ సందర్భంగా అదనపు సంచాలకులు (ఇంచార్జి) గా నియమితులైన పోతుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాచార శాఖలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో పనిచేయడం నాకు ఎంతో విలువైన అనుభవాన్ని ఇచ్చిందన్నారు. ప్రతి బాధ్యత నాకు కొత్త పాఠాన్ని నేర్పిందన్నారు. సహచర ఉద్యోగులు, అధికారుల సహకారం వల్లే నేను ఈ స్థాయికి చేరుకోగలిగానని కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులందరినీ ఒక కుటుంబంగా భావించి, పరస్పర సమన్వయంతో శాఖాభివృద్ధికి పాటుపడుతానని ఆయన స్పష్టం చేశారు.

**ప్రజాహితమే లక్ష్యం:** ప్రభుత్వ సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తోందని, ఈ బాధ్యతను మరింత మెరుగ్గా, అంకితభావంతో నిర్వహిస్తానని పి. కిరణ్ కుమార్ వెల్లడించారు. జాయింట్ డైరెక్టర్లు ఐ. సూర్యచంద్రరావు, సీఐఈ ఓ. మధుసూధన, ఆర్ఐఈ డాక్టర్ టి. నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు పి. వెంకట్రాజ్ గౌడ్, డి. రమేశ్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఏఎస్ వీరభద్రరావు, కే. నారాయణ రెడ్డి, పి. రాజశేఖర్, డాక్టర్ కె. తిరుపాలయ్య, ఎస్వీ మోహన్ రావు, గణాంక విభాగం నుంచి నాగరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొని కిరణ్ కుమార్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## పదవ తరగతి మెరిట్ విద్యార్థులతో ర్యాలీ



**పెడన,మే 27 (వార్తాప్రభ) :** పెడన మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బంగ్లా స్కూల్ వద్ద నుండి బస్టాండ్ వరకు ఎస్ఎస్సి 2026 పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం ద్వారా వారికి చేకూరిన లబ్ధి గురించి విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడించడం జరిగింది. అదేవిధంగా బడి పిలుస్తోంది (ఎన్రోల్మెంట్ డ్రైవ్ ) లో భాగంగా పలు బంగ్లా స్కూల్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ చేయించుట జరిగింది.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కృష్ణ జిల్లా ఏ.యమ్.ఓ ఆర్ శ్యామ్ సుందర్ ఎమ్ ఈ వో 1 సలోమి ఎమ్ ఈ వో 2 వై వి హరనాథ్ దాత మట్టా రాధా కృష్ణ మూర్తి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు సి ఆర్ ఎమ్ టీ లు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిసిఎస్ లో ఉద్యోగాలు సాధించిన చల్లపల్లి శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజ్ విద్యార్థులు..



**చల్లపల్లి:అవనిగడ్డ,మే 27 (వార్తాప్రభ) :** స్థానిక శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజీలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్న వంపుగాని ఉదయలక్ష్మి ,షేక్ షాహిదా ఇద్దరు విద్యార్థినులు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టి సి ఎస్) లో సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్ బాబు అన్నారు. నాలుగు దఫాలుగా నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలలో అర్హత సాధించి ఫైనల్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయినట్టు, త్వరలో ఉద్యోగంలో చేరుటకు సిద్ధంగా ఉండాలని కంపెనీ నుండి బుధవారం ఈమెయిల్ ద్వారా సమాచారం అందినట్లు చెప్పారు.ఇంకా మరికొందరి విద్యార్థుల ఫలితాలు రావాల్సి ఉందన్నారు. మారు మూల గ్రామాలలో పేద రైతు కుటుంబాలలో జన్మించి డిగ్రీ చదువుతూ కాలేజీలో అందించిన శిక్షణ ద్వారా టెక్నికల్ కోర్సులకు ఏ మాత్రము తీసిపోకుండా సాఫ్ట్వేర్ ఉద్యోగం సాధించిన విద్యార్థినులను వారి తల్లిదండ్రులను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ శ్రీ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీ పెమ్మసాని రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ పంచకర్ల శంకర్రావు, ఇతర అధ్యాపక బృందం తో పాటు తాట్ వేవ్ కంపెనీ ప్రతినిధులైన హరీష్, రాజేంద్ర, సాయి తదితరులు ఈ సందర్భంగా విద్యార్థినులను సత్కరించి అభినందించారు.

## కనుల పండుగ మహానాడు




**తిరువూరు,మే 27 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న నందమూరి తారక రామారావు అణగారిన వర్గాల రాజకీయ చైతన్యం కొరకు తెలుగుదేశం పార్టీ స్థాపించి రాజకీయ మహా సంగ్రామాన్ని పూరించిన మహా నాయకుడు అన్న ఎన్టీ రామారావు గారి స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన ఆధ్వర్యంలో ప్రారంభమైన మహానాడు నేటికీ నాటికి ఇంటింటి పసుపు పండుగ మహానాడు కొనసాగుతోంది శ్రీరస్తు కళ్యాణ మండపంలో ఆన్లైన్లో జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని సామాన్యుడిగా క్రింద కూర్చుని పార్టీ నాయకులు కార్యకర్తలతో వీక్షించినఎమ్మెల్యే కొలికిపూడి భారీగా హాజరైన తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు కార్యకర్తలతో నాయకులు నిండిపోయింది మహానాడు కార్యక్రమాన్ని వీక్షించడానికి వచ్చిన కార్యకర్తలకు కళ్యాణ మండపం ప్రాంగణంలో భోజనాలు ఏర్పాటు చేశారు విక్టరీకి మారుపేరు చంద్రబాబు నాయుడు అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

## ఆపరేషన్ క్లీన్ స్వీప్



**తిరువూరు,మే 27 (వార్తాప్రభ) :** తిరువూరు ఒక రాష్ట్రం ఒక పరిశుభ్రత లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం గం.7.00 నుండి గం.9.00 వరకు మున్సిపల్ ప్రత్యేక అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ శ్రీ ఏ. కుమార్ పట్టణంలోని వివిధ వార్డులలో నిర్వహించబడుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రజలు పరిశుభ్రత పరిరక్షణలో భాగస్వాములు కావాలని, మున్సిపాలిటీ చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. అదేవిధంగా గృహాల నుండి వెలువడే తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా అందించవలసిన అవసరాన్ని ప్రజలకు వివరించారు.అనంతరం సర్దార్‌పేట బాపనయ్య కూరగాయల మార్కెట్ మరియు పట్టణంలోని పలు ప్రజా ప్రదేశాలను సందర్శించి, ఆయా ప్రాంతాలలో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు, పరిశుభ్రత నిర్వహణ, చెత్త సేకరణ మరియు పారిశుధ్య చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీమతి కె మనోజ మరియు వై.విజయబాబు, మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ , సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ఋతుక్రమం సమయంలో ఎక్కువగా ప్రోటీన్ కల్గిన ఆహారం తీసుకోవాలి

- ఐసిడిఎస్ పీడి రుక్సానా సుల్తానా బేగం
- మైలవరం సీడీపీవో ఆఫీస్ లో అంతర్జాతీయ ఋతుక్రమ దినోత్సవం






**మైలవరం,మే 27 (వార్తాప్రభ) :** ఋతుక్రమం సమయంలో ఎక్కువగా ప్రోటీన్ కల్గిన ఆహారం తీసుకోవాలని జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం అన్నారు. మైలవరం పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మరియు విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ ఋతుక్రమం దినోత్సవం నిర్వహించారు.సీడీపీవో కె. పుష్పలత అధ్యక్షతన జరిగిన సదస్సులో ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 28న అంతర్జాతీయ ఋతుక్రమ దినోత్సవం జరుపుకుంటామని,ప్రతి అమ్మాయికి వయస్సు లేదా శరీరాన్ని బట్టి 28– 30 రోజుల వ్యవధిలో ప్రతి నెల ఋతుక్రమం జరుగుతుందన్నారు. ఋతుక్రమం సమయంలో ఎక్కువగా ఆకుకూరలు మరియు ప్రోటీన్ కల్గిన పండ్లు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని లేకపోతే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుందని తెలిపారు. శానిటరీ పాడ్స్ వాడాలనీ ప్రతి 6 గంటలకు ఒక్కసారి పాడ్స్ మార్చుకోవాలన్నారు. స్కూల్, కాలేజీ మరియు ఆఫీస్ కి వెళ్ళేటప్పుడు పాడ్స్ అందుబాటులో ఉంచుకోవాలని తెలియజేశారు.ఐరన్ టాబ్లెట్ మరియు సి విటమిన్ కలిగిన పండ్లు తీసుకుంటే మంచిదన్నారు. సీడీపీవో పుష్పలత మాట్లాడుతూ ఋతుక్రమం ప్రతినెల సక్రమంగా వస్తేనే ఆరోగ్యంగా ఉంటారనీ,అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలిని పేర్కొన్నారు.డాక్టర్ అరుణ మాట్లాడుతూ ఋతుక్రమం అనేది జీవనశైలిలో చాలా ప్రముఖ్యమైనదని, ఋతుక్రమం సక్రమంగా జరగక చాలా మంది హాస్పిటల్ కు వస్తున్నారని తెలిపారు.ఆ సమయంలో ఆకు కూరలు మరియు ఫ్రూట్స్ తీసుకోవాలని వెల్లడించారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ భార్గవి ఋతుక్రమం జరిగే ప్రక్రియ మరియు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి డెమో ద్వారా అవగాహన కల్పించారు.తరువాత పీడీ రుక్సానా బేగం స్థానిక అధికారులు,విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తో కలిసి ఋతుక్రమం పోస్టర్స్ మరియు బుకలేట్ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి యమ్. రాజేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు శ్రీలక్ష్మి, జోజి కటాక్షం, శివ కుమారి, మాధవి, డీసీపీయు సిబ్బంది దుర్గ ప్రసాద్, జాన్సన్, కిరణ్ కుమార్, లత, ధనలక్ష్మి, రాణి, వి సి ఫ్ సిబ్బంది శిరీష, దివ్య మరియు ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు,150 మంది కౌమార బాలికలు పాల్గొన్నారు.

## మెడికవర్ లో ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవ ప్రత్యేక అవగాహన



**కాకినాడ,మే 27 (వార్తాప్రభ) :** మే 27, ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ కృష్ణ చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ సీఐ కృష్ణ చైతన్య మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో సమయానికి వైద్య సేవలు అందించడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, గుండెపోటులు, ఇతర అత్యవసర సందర్భాల్లో ప్రజలు భయపడకుండా వెంటనే అంబులెన్స్ సేవలను సంప్రదించాలని సూచించారు. ప్రజల్లో ప్రథమ చికిత్సపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ జయప్రకాశ్, హెచ్ఓడి మరియు ఎమర్జెన్సీ ఫిజిషియన్ మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవల్లో “గోల్డెన్ అవర్” ఎంతో కీలకమని వివరించారు. ప్రమాదం జరిగిన మొదటి గంటలో సరైన చికిత్స అందితే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్ మరియు ఫస్ట్ ఎయిడ్ వంటి ప్రాథమిక వైద్య పరిజ్ఞానం నేర్చుకోవాలని సూచించారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ ఎన్. అంజిబాబు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన అత్యవసర వైద్య సేవలను అందించేందుకు మెడికోవర్ హాస్పిటల్స్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. ఆధునిక సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందంతో 24 గంటల అత్యవసర సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా వేగవంతమైన వైద్య సేవలు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అత్యవసర విభాగ వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.అనంతరం అత్యవసర సేవలు సిబ్బందిని సన్మానించారు అత్యవసర వైద్య సేవల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు నిర్వహించారు.

## తిరువూరు నియోజకవర్గంలో హిస్టరీ క్రియేట్ చేసిన విస్సన్నపేట 8 క్లస్టర్





**విస్సన్నపేట,మే 27 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో డిజిటల్ మహానాడు తిరువూరు క్లస్టర్ 8 విస్సన్నపేట పరిధిలో నియోజకవర్గస్థాయిలో హిస్టరీ క్రియేట్ చేసినట్లు సర్వత్రా అనుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలుగింటి ఆడపడుచుల పేర్లను లక్కీ డీప్ ద్వారా రెండు పేర్లను డ్రా తీసి వారికి మిక్సీ మరియు గ్రైండర్లను లలితా రామకృష్ణ సౌజన్యశీతో అందజేయడం జరిగింది. ఏసీ కళ్యాణ మండపం తో పాటు సుశాలమైన సోఫా సెట్లు భారీ స్క్రీన్ అత్యధికంగా హాజరైన ఆడపడుచుల వెల్లువ వేరసి వీడియో మరియు ఆడియో వీనులకు విందుగా న భూతో నభవిష్యతి అన్న చందంగా బాహుబలి మూవీ ని మించిన సౌండ్ సిస్టం ఉండటంతో ఉదయం 9 గంటలకు వచ్చినవాళ్లు సాయంత్రం ఐదు గంటల వరకు డీజిల్ మహానాడు వీక్షించడం జరిగింది. ఉదయం టిడిపి జెండాను ఎన్టీఆర్ జిల్లా టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి నెక్కలపు శ్రీనివాసరావు (డాబా శ్రీను ) ఆవిష్కరించారు. మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, మట్టా వేణుగోపాలరావు, జిల్లా నాయకులు ఆకుల రాధాకృష్ణ, మద్రిబోయిన వెంకటేశ్వరరావు( చిన్నోడు),పలగాని మాధవరావు,పల్లెపా0 రాంబాబు, లలితా రామకృష్ణ, అనుమోలు శివ బాజీ కంభంపాటి బద్రీనాథ్, నారాయణ, మల్లీ, రామినేని రామారావు, మండల మహిళా అధ్యక్షురాలు సంబారు నాగలక్ష్మి, జిల్లా కార్యవర్గ మహిళా నాయకురాలు నాదెళ్ల నాగమణి, నందమూరి శ్రీరామచంద్ర, శ్రీనివాసరెడ్డి,శ్రీ శ్రీ ఆర్ పి ,ఆకుల సత్యనారాయణ, గిరి రెడ్డి, రెడ్డి వెంకటేశ్వరరావు,భూషణం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ క్రమశిక్షణే సేవా భావానికి బాట

- ఉద్యోగ సంఘ నాయకత్వానికి ఎన్‌సీసీ అనుభవం ఎంతో దోహదం
- ఎన్‌సీసీ శిక్షణ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎ.విద్యాసాగర్



**తిరుపతి,మే 27 (వార్తాప్రభ) :** ఎన్‌సీసీతో అనుబంధం ద్వారా నేర్చుకున్న సమయపాలన, బాధ్యతాయుత వైఖరి, సమన్వయ నైపుణ్యాలు ఉద్యోగ సంఘ నాయకుడిగా తన ప్రయాణంలో ఎంతో ఉపయోగపడ్డాయని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు కనుగొనడంలో ఎన్‌సీసీ శిక్షణ ప్రత్యేకమైన దృక్పథాన్ని ఇచ్చిందన్నారు. బుధవారం తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్–11 ఆంధ్రా ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ కార్యాలయం వద్ద విద్యాసాగర్.. ఎన్‌సీసీ శిక్షణ అధికారి గా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) కీలక పాత్ర పోషిస్తోందని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాల పెంపుకు ఎన్‌సీసీ ఒక ఉత్తమ వేదికగా నిలుస్తోందన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో సమయపాలన, బాధ్యత, ఆత్మవిశ్వాసం వంటి గుణాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. పరేడ్‌లు, శిక్షణా శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా యువత సమాజానికి సేవ చేయాలనే భావన పెంపొందుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రకృతి విపత్తులు, రక్తదాన శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ వంటి సేవా కార్యక్రమాల్లో ఎన్‌సీసీ కేడెట్లు చురుకుగా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. రక్షణ దళాలు, పోలీసు శాఖలు మరియు ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్లకు ప్రాధాన్యత లభించడం విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తోందన్నారు. దేశానికి బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ సేవలు విశేషమని.. ఇలాంటి ఎన్‌సీసీకి రాష్ట్ర శిక్షణ అధికారిగా పదోన్నతి లభించడం చాలా ఆనందంగా, గర్వకారణమని పేర్కొన్నారు. సంఘటిత శక్తి, సేవా భావం, క్రమశిక్షణ – –– ఈ మూడు విలువలు ఎన్‌సీసీతో అనుబంధం ద్వారా అలవడినవేనని, అదే స్ఫూర్తితో ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నానని చెప్పారు. రాష్ట్ర శిక్షణ అధికారిగా బాధ్యతలు స్వీకరించడం గౌరవంగా భావిస్తున్నానని, ఎన్‌సీసీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తానని ఎ.విద్యాసాగర్ తెలిపారు. 1987లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించానని.. రెండుసార్లు జాతీయస్థాయిలో ఉత్తమ ఉద్యోగి అవార్డు సాధించానని.. డీజీఎన్‌సీసీ కమెండేషన్ కూడా పొందినట్లు తెలిపారు. మూడు గణతంత్ర దినోత్సవ క్యాంపులు, అయిదు ఆలిండియా వాయుసైనిక్ శిబిరాల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. 100కు పైగా జాతీయ, రాష్ట్రస్థాయి ఎన్‌సీసీ శిబిరాల్లో పాల్గొన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో 11 (ఏ) ఎయిర్ స్క్వాడ్రన్ (టీ) ఎన్‌సీసీ, తిరుపతి గ్రూప్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే, అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ షరీఫ్, సూపరింటెండెంట్ జి.శంకర్, ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, గుంటూరు జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు వి.రాఘవులు, తిరుపతి జిల్లా అధ్యక్షులు సీహెచ్ సురేష్, తిరుపతి నగరశాఖ అధ్యక్షులు పి.లలిత్ కుమార్, విజయవాడ నగర శాఖ అధ్యక్షులు సీహెచ్ సీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహానాడులో ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ నేతలు

-చంద్రబాబు సందేశాన్ని తిలకిస్తూ హర్షం



**కోడూరు, మే 27 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా ‘హైబ్రిడ్ విధానం ద్వారా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో కోడూరు మండల టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద, విశ్వనాథపల్లి గ్రామంలో 9,10 క్లస్టర్ల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీన్ ద్వారా పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన సందేశాన్ని పార్టీ నేతలు శ్రద్ధగా తిలకించారు. రానున్న ఎన్నికలే లక్ష్యంగా ప్రతి ఇంటికి వెళ్లి గత ప్రభుత్వ వైఫల్యాలను, టీడీపీ విజన్‌ను వివరిస్తాం. దివిసీమ రైతుల ముంపు సమస్య, అవుట్‌ఫాల్ గేట్ల అంశాన్ని అధినేత దృష్టికి తీసుకెళ్తాం అని మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు పేర్కొన్నారు. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు ,టీడీపీ మహిళా నేతలు, యువత, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేదీప్యమానంగా శ్రీ వేంకటేశ్వరుని దేవస్థాన వార్షికోత్సవాలు...





**గుడ్లవల్లేరు,మే 27 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థాన వార్షికోత్సవాలు బుధవారం దేదీప్యమానంగా నిర్వహించారు. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేతలు, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం విష్వక్సేనారాధన, పుణ్యాహం, యజమాన సంకల్పం, అగ్ని ప్రతిష్ఠ, నవకలశ పూజ, అష్టోత్తర శత కలశ పూజ, విశేష మహాశాంతి హోమం, శ్రీ వేంకటేశ్వర స్వామివారి ధవ మూర్తికి విశేష పూజ అష్టోత్తర కలశాభిషేకాల్ని వేద పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ మంగళ వాయిద్యాలతో నిర్వహించారు. సర్వాలంకార భూషితులైన ఉత్సవమూర్తులకు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలను వేద పండితులు గావించారు. భక్తులెల్లరూ ఈ ఉత్సవాలను తిలకించి స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. వేసవిలో భక్తజనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు చలువ పందిళ్లను ఏర్పరచి, మంచినీటి వంటి కనీస వసతుల్ని కల్పించారు.

## స్వచ్ఛ పథం విజయవంతంతో పరిసరాల పరిశుభ్రత : డీపీఓ



**గుడ్లవల్లేరు,మే 27 (వార్తాప్రభ) :** జిల్లాలోని పల్లెల్లో స్వచ్ఛ పథం విజయవంతంతో పరిసరాల పరిశుభ్రత ఏర్పడుతుందని జిల్లా పంచాయితి అధికారి ధనలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె గుడ్లవల్లేరులో నిర్వహించిన స్వచ్ఛ పథంలో పాల్గొని పరిసరాలను శుభ్రపరచటంమే గాక మొక్కలను నాటారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో “స్వచ్ఛ పథం” కార్యక్రమాన్ని విస్తతంగా నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. పారిశుధ్య కార్మికులతో సాధ్యం కానటువంటి ప్రాంతాల్లో మిషనరీతో త్వరితగతిన పనులను నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, రహదారుల శుభ్రత, చెత్త తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఆమెతో పాటు డీఎల్పీఓ సంపత్ కుమారి, ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్, గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు, పంచాయితి ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## మున్సిపల్ మాజీ చైర్మన్ కటకం కు పితృ వియోగం



**పెడన,మే 27 (వార్తాప్రభ) :** పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ కటకం నాగకుమారి కి పితృ వియోగమైంది. ఆమె తండ్రి దైవపు కృష్ణారావు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వయస్సు 88 సంవత్సరాలు.. పట్టణంలోని 7 వ వార్డులో ఆయన కు పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. వైసీపీ నియోజకవర్గం ఇంచార్జ్ ఉప్పాల రాము ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి గరికపాటి రామా నాయుడు దైవపు మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం,త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను ముస్లిం సోదర, సోదరీమణులు వారి యొక్క కుటుంబ సభ్యులతో బంధుమిత్రులతో ఆహ్లాదకరంగా, సంతోషంగా పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఈద్గా, మసీదులకు వెళ్ళు మార్గాలలో ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయాలు కలుగకుండా చర్యలు పోలీసులు తీసుకున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా భద్రతా పరమైన ఏర్పాట్లు చేశారని తెలిపారుఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినట్లయితే పోలీస్ శాఖకు తెలియజేయవలసిందిగా లేదా డయల్ 100ను సంప్రదించవలసిందిగా ప్రజలకు పోలీసు శాఖ తరపున విజ్ఞప్తి చేశారు

## జాతీయ రహదారి-65పై ప్రమాదాల నివారణకు అధికారుల సంయుక్త పరిశీలన

**- కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసిపి కె. వెంకటయ్య వెల్లడి**



**కూకట్‌పల్లి, మే 27(వార్తాప్రభ):** జాతీయ రహదారి-65 పరిధిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్స్‌పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక పరిశీలన నిర్వహించారు. ఏసీపీ కూకట్‌పల్లి ట్రాఫిక్ కె. వెంకటయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్, మున్సిపల్, రవాణా శాఖల అధికారులు సంయుక్తంగా ప్రమాద ప్రాంతాలను సందర్శించి ప్రమాదాలకు దారితీసే కారణాలను విశ్లేషించారు. ఈ పరిశీలనలో సైబరాబాద్ మున్సిపల్ అధికారులు మౌనిక (డిఈఈ, అల్విన్ సర్కిల్), శ్రావణి (ఏఈఈ, కూకట్‌పల్లి సర్కిల్), రమేష్ (, డిఈఈ మూసాపేట్ సర్కిల్), మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనుబాబు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శేఖర్ రెడ్డి, ఎస్సై రామకృష్ణ, ఆర్టీఏఎం సెల్‌కు చెందిన పీసీ రాజు, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. అధికారులు మెట్రో పిల్లర్ నంబర్లు 740 నుంచి 763 వరకు, 824 నుంచి 841 వరకు, అలాగే 874 నుంచి 896 వరకు ఉన్న ప్రమాద ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రహదారి నిర్మాణ లోపాలు, ట్రాఫిక్ ఒత్తిడి, సిగ్నలింగ్ సమస్యలు, వాహనాల వేగం తదితర అంశాలను సమీక్షించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు బలోపేతం చేయడం వంటి అంశాలపై అధికారులు సూచనలు చేసినట్లు తెలిపారు.

## కూకట్‌పల్లి డిపోకు 60 ఎలక్ట్రిక్ బస్సులు

**- మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఘన ప్రారంభం**

**- ప్రజా రవాణాలో కొత్త అధ్యాయం.. కాలుష్య రహిత నగర దిశగా కీలక అడుగు...**



**కూకట్‌పల్లి,మే 27(వార్తాప్రభ):** హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దే దిశగా కూకట్‌పల్లి డిపోకు 60 నూతన ఎలక్ట్రిక్ బస్సులను కేటాయిస్తూ ఘన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి,రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీ వ్యవస్థలో పలు కీలక సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 545 ఎలక్ట్రిక్ బస్సులు సేవలందిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా మరో 2,200 ఈవీ బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. హైదరాబాద్ నగర పరిధిలో కొత్త కాలనీలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థను కూడా అదే స్థాయిలో విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, కాలుష్య రహిత, ఆధునిక రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని బండి రమేష్ తెలిపారు. త్వరలోనే పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆర్థిక భారం తగ్గిందని, కొత్త బస్సుల కొనుగోలు ద్వారా మహిళలను ప్రజా రవాణా వ్యవస్థలో భాగస్వాములుగా నిలబెట్టామని పేర్కొన్నారు. మహిళల భద్రత, సౌకర్యం, భాగస్వామ్యం పెంపు కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కూకట్‌పల్లి డిపో విస్తరణలో భాగంగా ఐదు ఎకరాల స్థలంలో కొత్త డిపో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చి కూకట్‌పల్లి ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో కాలుష్య రహిత ప్రజా రవాణా కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈవీ బస్సుల ప్రారంభంతో కూకట్‌పల్లి ప్రాంత ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన మరియు పర్యావరణ హితమైన ప్రయాణ సేవలు అందుబాటులోకి రానున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భవన నిర్మాణ రంగంలో... మేస్త్రీలు సెంట్రింగ్ కార్మికుల పాత్ర విడదీయరానిది.

**బి ఎన్ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న.**



**జవహర్ నగర్, మే 27: (వార్తా ప్రభ)**భవన నిర్మాణరంగంలో తాపీ మేస్త్రీలు, సెంట్రింగ్ కార్మికుల పాత్ర విడదీయరానిదని తాపీ మేస్త్రీలు సెంట్రింగ్ కార్మికులు గొప్ప అనుబంధంతో పనిచేస్తారని బి ఎన్ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న తెలిపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ గిరిప్రసాద్ నగర్ భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో బుధవారం, జూన్ 8వ తేదీన హైదరాబాద్లోని భవన నిర్మాణ రంగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆత్మ గౌరవ సభ నిర్వహిస్తున్నందున జూన్ 8వ తేదీన బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభకు సంబంధించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి ఎన్ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న హాజరై మాట్లాడుతూ సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమ్మె నేపథ్యంలో తాపీ మేస్త్రీలను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. భవన నిర్మాణ రంగంలో తాపీ మేస్త్రీలు సెంట్రింగ్ కార్మికుల పాత్ర విడదీయరానిదని కార్మికుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు ఆత్మగౌరవ పరిరక్షణ కోసమే ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బియన్ ఆర్ కె ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సూర వెంకటయ్య, గిరిప్రసాద్ నగర్ శాఖ అధ్యక్షులు సిహెచ్ వెంకటయ్య, ఉపాధ్యక్షులు కే. రామాచారి, రవీంద్ర చారి, కార్యదర్శులు రుక్మయ్య, కాలనీ అధ్యక్షులు లింగోజి, బస్తి నాయకులు కురుమన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పలు పార్టీలో నుంచి భారీగా సిపిఐ పార్టీలో చేరిక

- **అభివృద్ధిని చేసి చూపిస్తాం**
- **ప్రజలు సిపిఐ పార్టీని ఆదరిస్తున్నారు సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాష**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, కొత్తగూడెం నియోజవర్గం అభివృద్ధిని చూసి ఆకర్షితులై ప్రజలు సిపిఐ పార్టీని ఆదరిస్తున్నారనిబుధవారం సుజాతనగర్ మండలంలోని జామ్లా తండా గ్రామంలో పలు పార్టీల నుండి సిపిఐ పార్టీలోకి చేరారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాష అన్నారు అనంతరం పార్టీలో చేరిన వారికి ఎర్ర కండవు కప్పి ఆహ్వానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సుజాతనగర్ మండలాన్ని అభివృద్ధి కోసం కొత్తగూడెం శాసనసభ్యులు పూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని తెలియజేశారు గ్రామాలలో రోడ్లు డ్రైనేజీ విద్యుత్ సదుపాయం త్రాగునీరు మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు ప్రజలకు ఏ కష్టం వచ్చినా సిపిఐ పార్టీ అందుబాటులో ఉంటుందని పార్టీలకు అతీతంగా ప్రజాసేవ చేస్తున్నామని తెలిపారుజామ్లా తండా నాలుగో వార్డ్ మెంబర్ యుగంధర్ కళ్యాణ్ బిక్కు శ్రీను కోటేష్ గణేష్ తదితరులు సిపిఐ పార్టీలో చేరారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు కార్యవర్గ సభ్యులు భూక్యా దసురు సిపిఐ మండల నాయకులు భూక్య శీను గుగులోత్ బాలు పొమ్య అనిల్ నాయక్ రాంబాబు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## త్యాగమూర్తి... మాత రమాబాయి అంబేద్కర్.

- **ఆమె సేవలు త్యాగం సహనం సేవా భావానికి నిలువెత్తు నిదర్శనం.**
- **జవహర్ నగర్ బిజెపి అధ్యక్షులు కలికోట కమలాకర్.**



**జవహర్ నగర్, మే 27: (వార్తా ప్రభ)** త్యాగం సహనం సేవా భావానికి నిలువెత్తు నిదర్శనం త్యాగమూర్తి మాత రమాబాయి అంబేద్కర్ అని జవహర్ నగర్ బిజెపి అధ్యక్షులు కలికోట కమలాకర్ అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ బాలాజీ నగర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మరాఠీ బాబు ఆధ్వర్యంలో బుధవారం మాత రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలికోట కమలాకర్ తదితరులు హాజరై మాత రమాబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి వందనం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత ప్రయాణంలో మాత రమాబాయి పాత్ర అత్యంత విశిష్టమైనది అన్నారు. భారతదేశానికి ఆమె చేసిన సేవ యావద్దేశం గుర్తుంచుకుంటుందని, అంబేద్కర్ విద్యాభ్యాసం ,సామాజిక పోరాటం, దేశ సేవలో ముందుకు సాగేందుకు రమాబాయి ఎన్నో కష్టాలు భరించి తన కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ ఆయనకు అండగా నిలిచారని కొనియాడారు. త్యాగం సహనం సేవా భావానికి ప్రతిరూపమే మాత రమాబాయి అని ఆమె సమాజానికి ఆదర్శ మూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి చంద్రపురి కాలనీ అధ్యక్షులు కర్లపూడి జోగారావు, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి, డాక్టర్ యాదగిరి, ముచ్చర్ల యాదగిరి, దయాకర్, సాయి, క్రాంతి, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ స్ఫూర్తితోనే శేరిలింగంపల్లి ప్రగతి

● **రాజకీయాల్లో ఓనమాలు నేర్పిన ఆరాధ్యదైవం ఎన్టీఆర్** ● **మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహానాయకుడు** ● **తెలుగుజాతి ఉన్నంతవరకు ఆయన కీర్తి చిరస్థాయి** ● **ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మధుర స్మృతులు గుర్తుచేసుకున్న ఆరికెపూడి గాంధీ** ● **ఎన్టీఆర్ స్ఫూర్తితోనే హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఎదిగానన్న గాంధీ**



**కూకట్ పల్లి మే 27(వార్తాప్రభ):**తెలుగుజాతి ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు.. సంక్షేమానికి సరికొత్త నిర్వచనం చెబుతూ రాజకీయాల్లో నవశకానికి నాంది పలికిన యుగపురుషుడు నందమూరి తారక రామారావు. ఎన్టీఆర్ అంటే ఒక పేరు కాదు.. ప్రగతికి,పోరాటానికి ఒక సజీవ సాక్ష్యం.ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆ మహానాయకుడితో తనకున్న అనుబంధాన్ని శేరిలింగంపల్లి హ్యాట్రిక్ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ మీడియాతో పంచుకున్నారు. ఆయన స్ఫూర్తి, ఆశయాలే తన రాజకీయ ప్రస్థానానికి దిక్సూచి అంటూ ఆయన ప్రవేశపెట్టిన చారిత్రాత్మక సంస్కరణలను గాంధీ అత్యంత భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు.

తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన వెండితెర ఇలవేల్పు నందమూరి తారక రామారావుతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ నెమరువేసుకున్నారు. మే 28న ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులర్పించారు. రాజకీయాల్లో తనకు ఓనమాలు నేర్పిన ఆదర్శమూర్తి ఆయనేనని, ఆయన ఆశయాలు, విలువలే పునాదిగా నేడు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో అగ్రగామిగా నిలుపుతున్నట్లు తెలిపారు. ఒక సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి, నేడు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రజాసేవలో ఉన్నానంటే దానికి ఎన్టీఆర్ ఇచ్చిన స్ఫూర్తి, ఆయనతో సాగిన మధుర క్షణాలే కారణమని వెల్లడించారు.రాముడు, కృష్ణుడు అంటే ఇలాగే ఉంటారనేలా కోట్లాది మంది హృదయాల్లో ముద్ర వేసుకున్న ఎన్టీఆర్ రూపం అజరామరమని కొనియాడారు. కేవలం వెండితెరకే పరిమితం కాకుండా, రాజకీయాల్లోకి ప్రవేశించి నిఖార్సయిన పేదల పక్షపాతిగా నిలిచారని స్పష్టం చేశారు. పేదవాడి ఆకలి తీర్చడమే పరమావధిగా రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి బృహత్తర సామాజిక పథకాన్ని ప్రవేశపెట్టిన మహోన్నతుడని శ్లాఘించారు. పరిపాలనా వికేంద్రీకరణకు అద్దం పడుతూ బ్రిటీష్ కాలం నాటి పాత తాలూకా వ్యవస్థను ధైర్యంగా రద్దు చేసి, మండల వ్యవస్థను తీసుకువచ్చిన ఘనత ఆ మహానాయకుడిదేనని గుర్తుచేశారు. దీనితో పాటుగా, సమాజంలో సగభాగమైన మహిళల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహాపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఆడపిల్లలకు సైతం వారసత్వ ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తూ చారిత్రాత్మక చట్టాన్ని తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రశంసించారు. ఈ విప్లవాత్మక సంస్కరణల ద్వారా ప్రభుత్వ సేవలను నేరుగా గ్రామీణ ప్రజల చెంతకు చేర్చి, దేశవ్యాప్తంగా భారీ రాజకీయ, సామాజిక మార్పులకు నాంది పలికారని విశ్లేషించారు.ఎన్టీఆర్ ఆశయాల వెల్లువలో ప్రభావితమై రాజకీయాల్లోకి వచ్చిన లక్షలాది మంది యువకుల్లో తాను ముందు వరుసలో ఉంటానని ఆరికెపూడి గాంధీ సగర్వంగా ప్రకటించారు. ఆ మహానుభావుడిని పలు దఫాలుగా ప్రత్యక్షంగా కలుసుకునే అరుదైన అదృష్టం తనకు దక్కిందని, ఆ తీపి గుర్తులు తన జీవితాంతం నిలిచిపోతాయని భావోద్వేగానికి లోనయ్యారు. అసలైన ప్రజా నాయకుడు ప్రజల మధ్య ఎలా ఉండాలి, వారి సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే అత్యున్నత విలువలను ఎన్టీఆర్ ను చూసే నేర్చుకున్నట్లు చెప్పారు. ఆ మహానాయకుడి నీడన రాజకీయ పాఠాలు నేర్చుకోవడం, ఆయన అడుగుజాడల్లో నడవడం తన జీవితానికి దక్కిన అత్యంత అద్భుత వరంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా తెలుగు మాట్లాడే ఆఖరి వ్యక్తి ఉన్నంత వరకు ఎన్టీఆర్ కీర్తి, ఆయన ప్రతిష్ట అజరామరంగా వెలుగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. నాడు యువతలో ఆయన నింపిన చైతన్యం, నేర్పిన రాజకీయ విలువలను నేటికీ తూచా తప్పకుండా పాటిస్తున్నట్లు చెప్పారు. ఆయన ఆశయాల బలమే శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసేందుకు తనకు కొండంత అండగా నిలుస్తోందని వివరించారు. ఎన్టీఆర్ జయంతి వేళ ఆయన చూపిన ప్రజా సంక్షేమ బాటలోనే పయనిస్తూ, నియోజకవర్గ సమగ్ర ప్రగతికి పునరంకితం అవుతామని ఉద్ఘాటించారు.

# వార్తా ప్రభ

# హైదరాబాద్

## బెల్లి లలితక్క కి ఘన నివాళు లర్పించిన డా.అశోక్ యాదవ్



**మంచిర్యాల/ భీమారం, మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బెల్లి లలితక్క చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ యాదవ్ మాట్లాడుతూ "తెలంగాణ ఉద్యమం నికి ఊపిరి పోసిన వీరనారి ప్రాణత్యాగం చేసిన బెల్లి లలితక్క గారి పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం. ఆమె ఆశయాల సాధన కోసం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం మనం నిరంతరం పోరాడాలి" అని మహనీయుల విగ్రహాలతో పాటు బెల్లి లలితక్క దొడ్డి కొమురయ్య విగ్రహాలు ట్యాంక్ బండమీద స్థాపించాలని జయంతి వర్ధంతి ప్రభుత్వం అధికారికంగా చేయాలని పిలుపునిచ్చారు. బెల్లి లలితక్క లాంటి త్యాగమూర్తుల వల్లే నేడు తెలంగాణ సాధ్యమైంది. ఆమె కలలు కన్న బంగారు తెలంగాణ కోసం గొర్రెల కాపరులు, యాదవులు ఐక్యంగా ఉద్యమించాలి అన్నారు జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సంఘం నాయకులు సంఘం సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని లలితక్కకు జోహార్లు అర్పించారు. భీమారం మండల కేంద్రంలో బెల్లి లలితక్క వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, చిల్లారపు సంతోష్ యాదవ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మెండే మల్లేష్ యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి కేశవేణి సత్యనారాయణ యాదవ్ మండల ఉపాధ్యక్షులు దారవేణి తిరుపతి యాదవ్ గౌరవాధ్యక్షులు వేల్పుల పర్వతాలు యాదవ్, చెవ్వ శివా యాదవ్, కత్తర్ల సాగర్ యాదవ్, యాదన బోయిన రామన్న శ్రీధర్ యాదవ్ మండల నాయకులు నివాళులర్పించారు.

## ఘనంగా జిట్టా సునీల్ యాదవ్ జన్మదిన వేడుకలు.



**కూకట్ పల్లి,మే 27(వార్తాప్రభ)**కైతలాపూర్ డివిజన్ పరిధిలో ని ప్రగతి నగర్ కమ్యూనిటీ హాల్ లో కూకట్ పల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు జిట్టా సునీల్ యాదవ్ జన్మదిన సందర్భంగా కైతలాపూర్ డివిజన్ లో పలు కాలనీ వాసులు మరియు రాజకీయ ప్రముఖులు స్నేహితులు మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, మాజీ కార్పొరేటర్లు పగడాల బాబురావు, కోడిచెర్ల మహేందర్,తూము శ్రావణ్ కుమార్,కాంగ్రెస్ నాయకులు ,ఎ బ్లాక్ అధ్యక్షులు పి నాగిరెడ్డి,బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు,గుడెప్ నాగారజ్, గాలిబాలాజీ,శేరి సతీష్ రెడ్డి,పుష్ప రెడ్డి,యాదగిరి,తూము మనోజ్ కుమార్,దినేష్,ప్రతాప్ రెడ్డి,రాచమల్ల శేఖర్ గౌడ్,రమేష్,కృష్ణ రాజ్ పుత్, ప్రవీణ్,అసిఫ్,సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామం లో ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు



**మాదాపూర్,మే 27 (వార్తాప్రభ):**మాదాపూర్ లోని శిల్పారామం లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మహబూబ్‌నగర్‌కు చెందిన నాట్య గురువు శాంతి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గణేశ కౌతం,సూర్యాష్టకం, తాండవమాడెను శివుడు,అన్నమయ్య సంకీర్తనలు,గణేశ పంచరత్నం,తారంగం,గోవింద నామాలు,జయ జయ దుర్గే, దేవా దేవం భజే,మంగళం వంటి అంశాలను కళాకారులు భవిష్య, మహాసేన,నిత్య, వైష్ణవి,లక్ష్య, లాస్యశ్రీ, తన్విక, శ్రీమాన్య, లలిత, మహతి,యశ్వి తదితరులు ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

## ముగ్గురు అంతః రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్. -ఎస్పీ అఖిల్ మహాజన్

**అదిలాబాద్ మే 27 (వార్తాప్రభ):**,.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతః రాష్ట్ర దొంగల ముఠాను ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈరోజు స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు.

# సంపాదకీయం

## వర్చువల్ గా అదరగొట్టబోతున్న మహానాడు

తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే మహానాడు పార్టీ పండుగకు సర్వం సిద్ధం అయిపోయింది. ఈ నెల 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు మహానాడుని నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి మహానాడుకు ఘనమైన స్వాగతాన్ని పలుకుతోంది. తెలుగుదేశం పార్టీకి ఆ పార్టీ కార్యకర్తలకు అత్యంత ప్రతిష్టాత్మకమైన తీరులో ప్రతీ ఏటా మహానాడు నిర్వహిస్తున్న సంగతి విధితమే. అంతే కాదు తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి మహానాడు కార్యక్రమాన్ని ప్రతీ యేటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా అందులో భాగంగా ఈ ఏడాది లో వచ్చిన మహానాడుకు ఘనంగా నిర్వహిస్తున్నారు. కేంద్రం చెప్పిన మార్గదర్శకాలు పాటిస్తూ పొదుపుగా వ్యవహరిస్తూ ఈసారి మహానాడుని జరుపుకుంటున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిమిత సంఖ్యలోనే నేతలతో భౌతికంగా వారి హాజరుతో ఈసారి మహానాడును నిర్వహిస్తున్నారు. ఇక వర్చువల్ గా ఇక్కడ నుంచి ఏపీ వ్యాప్తంగా పార్టీ అంతా కనెక్ట్ అవుతోంది. అలాగే దీనికి అనుసంధానంగా నియోజక వర్గాలు మండల కేంద్రాల్లో భారీ ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే మహానాడును పూర్తి స్థాయిలో అనుసంధానించారు. ఎంపిక చేసిన నియోజక వర్గాల నుంచి పార్టీ కార్యకర్తలతో పాటు నేతలతో ఈసారి మహానాడులో పార్టీ గురించిన అంశాల మీద మాట్లాడిస్తారని చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ అంటేనే టెక్నాలజీకి పెట్టింది పేరు. దాంతో వర్చువల్ గా మరింత ఘనంగా క్యాడర్ తో మరింత కనెక్ట్ అవుతూ మహానాడు నిర్వహించడం విశేషంగా చెప్పుకోవాలి. సాంకేతికత సాయంతో ప్రతి కార్యకర్తను నేరుగా అనుసంధానించే వినూత్న ప్రయత్నం ఈసారి జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఒక వేయి 848 క్లస్టర్ల ద్వారా డిజిటల్ పద్ధతిలో ఈసారి మహానాడు కనీ వినీ ఎరుగని తీరులో అద్భుతంగా జరగనుంది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేష్ పార్టీ నేతలు టెక్నాలజీ ఆసరాతో నేరుగానే కార్యకర్తలతో మాట్లాడతారని చెబుతున్నారు. ఈసారి మహానాడులో కీలకమైన అంశంగా స్త్రీ శక్తి అన్నది అజెండాలో చేర్చారు. స్త్రీశక్తి ప్రధాన అంశంగా ఈ యేడాది మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశంపార్టీ నిర్వహిస్తోందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఏపీలో టీడీపీ నాయకత్వంలో నడిచే కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంక్షేమం కోసం చేసిన కృషిని వివరిస్తారు. అలాగే టీడీపీ ఒక పార్టీగా మహిళల కోసం చేసిన కృషి, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మహానాడు వేదిక మీద నేతలు అంతా పెద్ద ఎత్తున చర్చించనున్నారని చెబుతున్నారు. ఇక కేంద్రం డైరెక్షన్ మేరకు పొదుపు చర్యల్లో భాగంగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమంలో ప్రతిరోజు ఆరు గంటల పాటు పార్టీ తీర్మానాలు వాటి పైన చర్చ, అలాగే రాష్ట్రాభివృద్ధిపై చర్చలు వంటివి నిర్వహిస్తారు. ఈ రెండు రోజులూ ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు డిజిటల్ విధానంలో మహానాడు జరగబోతుంది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు కార్యకర్తలు ఎవరూ అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లలో నాణ్యతా లోపాలు తలెత్తకుండా టీడీపీ పార్టీ యంత్రాంగం మొత్తం అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. దాంతో మహానాడు ఈసారి డిజిటల్ ఫ్లాట్ ఫారం మీద కూడా అదరగొట్టబోతోంది అని అంటున్నారు.

## విజయవాడ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో ఆయుష్మాన్ ఆరోగ్య శిబిర్ టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం



**విజయవాడ పశ్చిమ మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని జన సాంద్రత ఎక్కువగా వున్న ప్రాంతాల్లోజాతీయ క్షయ నివారణ కార్యక్రమం విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా టీబీ ఎంబీఏ 2. 0 కార్యక్రమంలో భాగంగా విజయవాడ అర్బన్ పరిధిలోని గోల్లపాలెం గట్టు కొండ ప్రాంతం ఐరిస్కు వార్డుగా గుర్తించి ఆయుష్మాన్ ఆరోగ్య శిబిర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక టీవీ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట షేక్ రాజా హాస్పిటల్ లో కొండ ప్రాంతంలో ఉన్న ప్రజలకు హ్యాండ్ ఎక్స్ రే యంత్రం ద్వారా టీవీ పరీక్షలు నిర్వహించారు. ఎక్స్ రే లో అనుమానాస్పద లక్షణాలు కనిపించిన ప్రజలకు కఫం పరీక్ష కొరకు రిఫరచేయడం జరిగినది. ఈ కార్యక్రమంకు 50వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బోయి సత్తిబాబు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్ టి పి సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మమ్మ హితోక్తులు

అవహేళన చేయడం
అపనిందలు వేయడం
కాదు కాదు సముచితం
బాగుపడదు జీవితం
బద్ధకంగా ఉండడం
అభివృద్ధికి అవరోధం
అబద్దాలు చెప్పడం
బంధాలకు విఘాతం
చిన్నచూపు చూడడం
చిత్రంగా మారడం
చూపరులకు అసహ్యం
వదులుకుంటే క్షేమం
పంతాలకు పోవడం
పతనాన్ని కోరడం



హర్షింప దగినది కాదు
గౌరవం అందు లేదు

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# స్ట్రీట్ ఫుడ్ హబ్స్ ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో స్ట్రీట్ ఫుడ్ హబ్స్ ఏర్పాటు అంశంపై మెప్మా వారు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న పీఎంఎస్వానిధి పథకం కింద పర్యాటక, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ప్రాధాన్యత గల ప్రాంతాలలో స్ట్రీట్ ఫుడ్ హబ్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలపై తన ప్రతిపాదన తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అధిక జనసంచారం, పర్యాటక రద్దీ ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశారని, స్ట్రీట్ ఫుడ్ హబ్స్ ద్వారా వీధి వ్యాపారులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహార విక్రయ కేంద్రాలను అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. ఫుడ్ హబ్స్లో మహిళలు, పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ మరియు లైటింగ్, పార్కింగ్, అగ్నిమాపక భద్రత, సీసీ కెమెరా నిఘా వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా ఘన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాలు పాటించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని పేర్కొన్నారు

# సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీతో సెన్సస్-2027 నమోదు పూర్తి చేసిన కమిషనర్ ధ్యానచంద్ర

### సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసిన ప్రజలు తమ ఐడీని ఎన్యూమరేటర్లకు అందించాలని విజ్ఞప్తి

**విజయవాడ పశ్చిమ మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ మరియు చీఫ్ సెన్సస్ ఆఫీసర్ ధ్యానచంద్ర బుధవారం సెన్సస్--2027 కార్యక్రమంలో భాగంగా గత నెలలో తాను పూర్తి చేసిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ వివరాలను ఉపయోగించి వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో సిటీ సెన్సస్ ఆఫీసర్ మరియు అదనపు కమిషనర్ ఏ.రవీంద్ర రావు సమక్షంలో నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసుకున్న ప్రజలు తమకు వచ్చిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీని ఎన్యూమరేటర్లకు అందజేసి సెన్సస్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దీనివల్ల సమాచారం సులభంగా ధృవీకరణకు రావడంతో పాటు గణన ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. సెన్సస్--2027 దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, ప్రతి కుటుంబం తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. ప్రజలు సరైన వివరాలను అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిటీ సెన్సస్ ఆఫీసర్ మరియు ఆదనపు కమిషనర్ ఏ. రవీంద్ర రావు, సెన్సెస్ సూపర్వైజర్ మరియు టీపీవో గిరి, ఎన్యూమరేషన్ లీల ప్రశాంత్ పాల్గొన్నారు.



# డోకిపర్తి ఉపేంద్ర హై స్కూల్ లో ఎన్ సి సి ఫైర్ రేంజ్ ప్రారంభం



**విజయవాడ పశ్చిమ మే 27:(వార్తా ప్రభ ప్రతినిధి)**17 (ఏ) ఆంధ్ర బెటాలియన్ ఎన్.సి.సి కాకినాడ పరిధిలోని 9 జిల్లాల ఎన్.సి.సి విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించేందుకు జక్కంపూడి, వై ఎస్ ఆర్ కాలనీలోని తమ డోకిపర్తి ఉపేంద్ర హై స్కూల్ లో ఫైర్ రేంజ్ ఏర్పాటుచేసినట్లు స్కూల్ ఇన్చార్జి సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తూనుకుంట్ల శ్రీనివాసు చెప్పారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు నేర్పించేందుకు ఎన్.సి.సి ఉత్తమ వేదికగా నిలుస్తుందన్నారు. దేశానికి సేవలు అందించే ఆర్మీ, అగ్నివీర్ లలో చేరేందుకు ఎన్.సి.సి ద్వారా అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ట్రైనింగ్ జె.సి.ఓ (జూనియర్ కమీషనర్ ఆఫీసర్) సుబేదార్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ నేషనల్ క్యాడెట్ కార్ప్స్ వార్షిక శిక్షణలో భాగంగా క్యాడెట్లకు ప్రతి రోజూ శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అబ్స్టాకిల్ ట్రైనింగ్, ఫైరింగ్ ప్రాక్టీస్, టెంట్ పిచింగ్, యోగా, ఫిజికల్ ట్రైనింగ్, డ్రిల్, వెపన్ ట్రైనింగ్, డిజాస్టర్ మేనేజ్మెంట్ వంటి అంశాలలో సమగ్ర శిక్షణ అందిస్తున్నామన్నారు. బెటాలియన్ పరిధిలోని 537 మంది క్యాడెట్లు ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ), సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ తదితర అంశాలపై నిపుణులచే ప్రత్యేక అతిథి ఉపన్యాసాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్.సి.సి క్యాడెట్ల శిక్షణకు అవసరమైన సహాయ సహకారాలను తమ గ్రూపు సంస్థల తరఫున అందిస్తామన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ పి.శ్యామల మాట్లాడుతూ వార్షిక శిక్షణ శిబిరం ద్వారా క్యాడెట్లలో దేశభక్తి, నాయకత్వం, సేవాభావం, క్రమశిక్షణ, జట్టు భావన (టీం స్పిరిట్) పెంపొందుతున్నాయన్నారు. క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ అజిత్ సింగ్ తోమర్, సుబేదార్ మేజర్ అనిల్ కుమార్ దహియా, క్యాంప్ అడ్జుటెంట్ కెప్టెన్ కెపీటి విజయ భాస్కర్ క్యాంప్ కార్యక్రమాలను సమన్వయపరుస్తున్నారు.

# ఆప్కాస్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలి.

### విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎ.ఐ.టి.యు.సి ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా



**విజయవాడ పశ్చిమ మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ నెరవేర్చటంలో ఘోరంగా విఫలమైనదని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎ.ఐ.టి.యు.సి ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా విమర్శించారు. బుదవారం ఉదయం ఏలూరు రెహమాన్ పార్క్ వద్ద 23వ డివిజన్ సానిటరీ కార్యాలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరం వరకు అప్కాస్ కార్మికులు అందరికీ కూడా అమ్మ ఒడి, ఇతర సంక్షేమ పథకాలు అన్ని వర్తించవని కానీ కూటమి ప్రభుత్వం వచ్చినాక ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా కార్మికులకు అందటం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో కార్మికుల సంక్షేమం కోసం అనేక హామీలను గుప్పించినదని కానీ ఏ ఒక్కటి అమలు చేయకపోగా ఉన్న అవకాశాలను కూడా అడ్డుకోవడం దారుణమని అన్నారు. గత సంవత్సరం తల్లికి వందనం పథకం ఆప్కాస్ కార్మికులందరికీ వర్తింప చేస్తానని చెప్పి జీవో కూడా విడుదల చేసి ఏ ఒక్కరికి కూడా అమలు చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం కాగితాలకే పరిమితమై ప్రకటనలు చేస్తుంది తప్ప ఏ ఒక్క కార్మికులకు కూడా న్యాయం జరగటం లేదని అన్నారు. ఇప్పటికైనా తాము ఇచ్చిన హామీలను మరొక్కసారి గుర్తుచేసుకొని ఆప్కాస్ కార్మికులందరికీ కూడా తల్లికి వందనం ఇతర సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎస్వీ ఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

# 20 గంటలు గడిచినా విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేని అధికారులను నిలదీసిన నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఇన్ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు



**జగ్గయ్యపేట మే 27 (వార్తప్రభ )** మున్సిపాలిటీ పరిధి, చిల్లకల్లు పలు గ్రామాల్లో గత 20 గంటలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఇన్ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజలు వంట చేసుకోవటానికి త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు చేయడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు తక్షణ చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న ఈ సమయంలో చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మహానాడు ప్రోగ్రాం లో సరదాగా గడుపుతున్నారే తప్ప ప్రజలకు ఇబ్బందులు పట్టీ పట్టనట్టు ఉన్నారు అన్నారు. ప్రకృతి వల్ల జరిగింది తెలిసిన విషయమే, అధికారులు దానికి తగ్గ మ్యాన్ పవర్ ని పెట్టుకొని తక్కువ సమయంలో విద్యుత్తు పునరుద్దించాలి, కానీ ఇలా గంటల తరబడి వేసవికాలంలో ప్రజల ప్రాణాలతో చెలగాటాడటం దారుణమని .ప్రజల సమస్యలపై ప్రభుత్వం, అధికారులు రాత్రి 8 గంటలకు విద్యుత్తు అందిస్తామని అధికారులు తెలియజేశారు లేకపోతే వైఎస్ఆర్సీపీ తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ బాధ్యత అని, నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, పట్టణ 26 వార్డు అధ్యక్షులు రుంజ నాగేశ్వరరావు, షేక్ గౌస్, షేక్ అల్లా బక్షు, కంబాల బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు

# బెజవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



**విజయవాడ పశ్చిమ మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ వారి సతీమణితో కలిసి విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు . న్యాయమూర్తి దంపతులకు ఆలయ కార్యనిర్వహణాధికారి వి కె సీనా నాయక్ సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. వి.కె. సీనా నాయక్ మరియు ఉప ప్రధాన అర్చకులు శ్రీ శంకర్ శాండిల్య , అర్చకుల బృందం దగ్గరుండి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు న్యాయమూర్తి దంపతులకు వేద ఆశీర్వచనం అందించి, అమ్మవారి ప్రసాదాలు మరియు శేషవస్త్రాన్ని మరియు శ్రీ అమ్మవారి చిత్రపటం బహూకరించారు.

# ఎన్డీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్

### కూటమినేతలతో కలిసి వినతులు స్వీకరించిన కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



**విజయవాడ పశ్చిమ మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ లకు విశేష స్పందన లభిస్తోంది బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్ లో పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను కూటమి నేతలకు అందజేశారు.. నూతన ఇంటి కొరకు దరఖాస్తులు, కొండ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, సామాజిక పెన్షన్లు, తాగునీటి ఇబ్బందులు తదితర అంశాలపై వినతులు అందాయని కూటమినేతల పేర్కొన్నారు. కొన్ని సమస్యలను కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు పీవీ చిన సుబ్బయ్య, గంజి పవన్, ఏలూరు సాయి శరత్, శనివారపు శివ, గన్నవరపు శ్రీనివాసరావు, ఈగల సాంబశివరావు, దాడి మురళి కృష్ణ,నక్కెట్ల రాజా, శ్యామ్ మారేపల్లి, మలపరెడ్డి అప్పారావు, గాదు గణేష్, సీ హెచ్ రామ నాయుడు, గూడూరు కొండయ్య,వీ ఆర్ ఓ నాని కుమార్ పాల్గొని వినతులు స్వీకరించారు.

# మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ అందజేత



**విజయవాడ పశ్చిమ మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో ముఖ్యమంత్రి సహాయనిది నుండి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను బుధవారం ఎన్డీఏ కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అందజేశారు. 52 వ డివిజన్ మల్లికార్జున పేటకు చెందిన పీ వరలక్ష్మి ( 52) అనారోగ్యం తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో మాజీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)ఎల్ ఓ సీ కొరకు ఎన్డీఏ కార్యాలయంలో దరఖాస్తు చేశారు .మంజూరైన రూ 3 లక్షల 15 వేల ఎల్ ఓ సీ పత్రాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.. త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీను అందజేయడంతో బాధితురాలి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుజనా చౌదరి కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు పీవీ చిన సుబ్బయ్య, గంజి పవన్, ఏలూరు సాయి శరత్, శనివారపు శివ, దాడి మురళి కృష్ణ,ఈగల సాంబశివరావు, నక్కెట్ల రాజా, శ్యామ్ మారేపల్లి, మలపరెడ్డి అప్పారావు, గాదు గణేష్, సీ హెచ్ రామ నాయుడు, గూడూరు కొండయ్య, గడ్డిపాటి కిరణ్ సుజనా మిత్రా దొడ్ల రాజా పాల్గొన్నారు..

# రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం



**జగ్గయ్యపేట మే 27 (వార్తప్రభ )** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని పి. వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్. జి. రాజు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్. ఆర్. శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్ఐ. సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరించి, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ప్రజల ప్రాణ భద్రత అందరి బాధ్యత అని పేర్కొంటూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ఆటో డ్రైవర్లు ముఖ్య పాత్ర పోషించాలని కోరారు.

# చేజర్లలో ఘనంగా మహానాడు ప్రారంభం

పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి , తాళ్లూరి గిరినాయుడు

**చేజర్ల మే 27 (వార్తాప్రభ)** నెల్లూరు జిల్లాలోని చేజర్ల మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో ఉన్న కళ్యాణ మండపంలో మహానాడు మొదటిరోజు వర్చువల్ కార్యక్రమాన్ని చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్ కమిటీ ఆధ్వర్యంలో విజయవంతంగా ప్రారంభించడం జరిగినది. తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడు మరియు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని టిడిపి కార్యకర్తలు నాయకులు వీక్షించేందుకు ఈ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాళ్లూరి గిరినాయుడు ఆనం కైవల్యా రెడ్డి మహానాడు పాల్గొన్నారు. వర్చువల్ మీటింగ్లో కార్యకర్తలకు భరోసాన్నివ్వడం జరిగినది. అలాగే తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగా



ఉంటుందని తెలిపారు. పార్టీ బలోపేతం దిశగా అందరం కృషి చేయాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో చేజర్ల



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మరియు 24 ఎల్ సోమశిల కాలువ అధ్యక్షులు ఉడతా హజరత్తయ్య రావి లక్ష్మీ నరసారెడ్డి మండల దళిత నాయకులు సోమవరపు హజరత్తయ్య చేజర్ల సొసైటీ అధ్యక్షులు బూదళ్ళ వీర రాఘవరెడ్డి సోమశిల ప్రాజెక్టు డైరెక్టర్ వేలూరి కేశవ చౌదరి మరియు తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రైస్తవుల హక్కుల పరిరక్షణ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

**డాక్టర్ కోలా ప్రసాద్**



**ఇబ్రహీంపట్నం, మే 27 (వార్తా ప్రభ ప్రతినిధి):** క్రైస్తవ రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు మదర్ తెరిసా అవార్డు గ్రహీత డాక్టర్ కోలా ప్రసాద్. మండల పరిధిలోని కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ లో భారత క్రైస్తవ ఐక్య పరిరక్షణ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కోలా ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఇండియా కౌన్సిల్ ద్వారా క్రైస్తవులకు అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, రాజ్యాంగం కల్పించిందన్నారు. క్రైస్తవుల హక్కుల విషయంలో ఉల్లంఘనలు, వివక్షత, వేధింపులు, లేదా దాడులను ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సమయాల్లో క్రైస్తవ రక్షణ చట్టాలను స్పష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మైనారిటీ హక్కుల పరిరక్షణకై కృషి చేస్తామన్నారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మొగులూరి ఎలీషా మాట్లాడుతూ క్రైస్తవ్యం సమాజ మేలు కోరుకుంటుందని, ప్రపంచ దేశాల క్షేమము కొరకు, భారతదేశంలో ఉన్న ప్రభుత్వాల కొరకు, నాయకులు, అధికారుల కొరకు అనునిత్యం ప్రార్థిస్తున్నామని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు, బిషప్ చింతపల్లి మోజస్, పాస్టర్ పాల్, అనిల్, చీఫ్ అడ్వైజర్ కేటీ ప్రభాకర్, బిషప్ జీవరత్నం, స్టాన్లీ ప్రభాకర్, డేవిడ్ రాజు, కృపా రాజు, దేవరాజు మరియు వివిధ గ్రామాల క్రైస్తవ నాయకులు పెద్దలు సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

**డిజిటల్ మహానాడులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ:**

## తెలుగు జాతి ఆత్మగౌరవం చాటే వేదిక



**రాయదుర్గం, మే 27 (వార్తా ప్రభ ప్రతినిధి):** డి.హీరేహాళ్ మండలంలోని శ్రీ ఆంజనేయ స్వామి టెంపుల్ కళ్యాణ మండపంలో జరిగిన డిజిటల్ మహానాడు కార్యక్రమంలో ఎంపీ పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. "నా తెలుగుదేశం – నా బాధ్యత" నినాదంతో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేస్తున్నారని, ఇది వారి అంకితభావాన్ని తెలియజేస్తుందని ఆయన అన్నారు. స్త్రీ శక్తి థీమ్తో జరుగుతున్న ఈ మహానాడు తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని మరింత చాటిచెబుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాల్వ భరత్, రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ యు.హనుమంత రెడ్డి, డి. హీరేహాళ్ మండలం కన్వీనర్ పి.మోహన్ రెడ్డి, నాగళ్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాల పండుగ




త్యాగం అనే మాటకు అర్థం చెప్పిన రోజు
ఇబ్రహీం పయగంబరు ప్రేమకు నిదర్శనం
అల్లాహ్ ఆజ్ఞకు తలవంచిన గొప్ప ఘడియ
కొడుకును సైతం అర్పించబోయిన క్షణం
ఖుర్బానీ అంటే కేవలం జంతు బలి కాదు
మనలోని స్వార్థాన్ని కోసే కత్తి అది
అహంకారాన్ని, దురాశను త్యాగం చేయమంటూ
మానవత్వానికి గుర్తుగా నిలిచిన పండుగ ఇది
పంచి తినమని చెప్పే పవిత్ర దినం
మూడు భాగాలుగా పంచే మాంసంలో
పేదవాడి ఆకలి తీర్చమని కోరే వేళ
సమానత్వపు రుచి, సౌభ్రాతృత్వపు వాసన
ఈద్ ముబారక్ అంటూ హత్తుకునే చేతులు
మతాలకు అతీతమైన మమతలు పంచే వేళ
బక్రీద్ అంటే బలి కాదు... బంధం
త్యాగంలోనే నిజమైన ఆనందం ఉందని చెప్పే పాఠం
మనసులోని అహాన్ని కుర్బానీగా ఇవ్వండి
ద్వేషాన్ని, కల్మషాన్ని విడనాడండి
ప్రేమను, ఆప్యాయతలను పంచండి
బక్రీద్ అంటే ఇదేనని తెలుసుకోండి

**- కొల్లాబత్తుల సూర్య కుమార్**

## బోధనేతరులకు జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించడం అన్యాయం.

- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎన్.టి.ఏ
- బోధనా వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులు జూనియర్ లెక్చరర్ పదోన్నతులకు అర్హులు కారా?
- ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలి
- ఎన్.టి.ఏ (నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్)

**విజయవాడ, మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జూనియర్ లెక్చరర్ పదోన్నతుల్లో ఉపాధ్యాయులను పక్కనపెట్టి బోధనేతర సిబ్బందికి అవకాశాలు కల్పించడం పట్ల నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ముప్పై సంవత్సరాలుగా బోధనా వృత్తిలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను విస్మరించి, బోధన అనుభవం లేని బోధనేతర సిబ్బందికి జూనియర్ లెక్చరర్ పదోన్నతులు ఇవ్వడం అన్యాయమని వారు పేర్కొన్నారు. జీవితంలో ఏనాడు చాక్‌పీస్ కూడా పట్టని వారు జూనియర్ లెక్చరర్ పదోన్నతులకు ఎలా అర్హులవుతారని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు చట్టపరమైన లేదా పరిపాలనా సమస్యలు ఉన్నట్లయితే, వాటిని పరిష్కరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. గత రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయులకు న్యాయం చేయాల్సిన విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం బోధనా వృత్తికి చెందిన వారికి చెందాల్సిన జూనియర్ లెక్చరర్ పోస్టులను బోధనేతర సిబ్బందికి ఇవ్వడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం బోధనేతర సిబ్బందికి జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించే ప్రక్రియను వెంటనే నిలిపివేసి, ఇప్పటికే జారీ చేసిన పదోన్నతులను రద్దు చేసి, అర్హత కలిగిన ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తెలుగుదేశంతోనే మహిళా సాధికారత సాధ్యం.

- పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్
- ఇబ్రహీంపట్నం మండలం జూపూడి లో వర్చువల్ మహానాడులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే





**ఇబ్రహీంపట్నం, మే 27 (వార్తా ప్రభ ప్రతినిధి):**తెలుగుదేశం పార్టీతోనే మహిళా సాధికారత సాధ్యమని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడిలోని కన్వెన్షన్‌లో 08 క్లస్టర్ పరిధిలో బుధవారం టీడీపీ వర్చువల్ మహానాడును నిర్వహించారు. ఈ వర్చువల్ మహానాడులో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహానాడు ప్రధాన కార్యక్రమాన్ని ఇక్కడ భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు, టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సారథ్యంలో పార్టీ మరింత శక్తివంతం అవుతోందన్నారు. ఈ మహానాడులో మహిళా సాధికారతపై ప్రత్యేక తీర్మానం చేసినట్లు తెలిపారు. స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించిన మహానాడులో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించింది టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. తల్లికి వందనం, దీపం 2.0, స్త్రీ శక్తి పథకం వంటి బృహత్తర పథకాలతో ఆడపడుచులకు అన్ని విధాలుగా చేయూతనిస్తున్నామన్నారు. మహానాడుతో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టామని, ప్రతి కార్యకర్తకు సాంకేతికతను చేరువ చేశామన్నారు. క్లస్టర్ 08 పరిధిలోని మహిళా కార్యకర్తలు, డ్వాక్రా సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో జూపూడి, చుట్టుపక్కల గ్రామాల టీడీపీ నాయకులు, మహిళా నేతలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. వర్చువల్ మహానాడు విజయవంతం కావడంతో మహిళా కార్యకర్తల్లో నూతనోత్సాహం, ఆత్మవిశ్వాసం పెరిగింది.

# తెలుగుదేశం పార్టీ కోసం పునరంకితం అవుదాం

**జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఇబ్రహీంపట్నంలో కన్నుల పండువగా పసుపు పండుగ**





**ఇబ్రహీంపట్నం, మే 27(వార్తా ప్రభ ప్రతినిధి):**తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ ఆశయాల సాధన, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఇబ్రహీంపట్నంలోని ముత్తవరపు కళ్యాణ మండపంలో క్లస్టర్ 9 పరిధిలో బుధవారం వర్చువల్ మహానాడును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు శ్రీమతి గద్దె అనురాధ, మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు అ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహానాడు ప్రధాన వేదిక కార్యక్రమాన్ని ఇక్కడ భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. క్లస్టర్ 9 పరిధిలోని ఇబ్రహీంపట్నం మండల పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని, టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ సందేశాన్ని కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పసుపు జెండా గౌరవాన్ని కాపాడేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని కోరారు. పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేద్దామని, విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొడదామని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ గారి ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రైతు, పేద, మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. మహానాడు తీర్మానాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులకు సూచించారు. ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేసే బాధ్యత కార్యకర్తలపై ఉందని నేతలు పేర్కొన్నారు. పార్టీ కుటుంబ సభ్యులందరూ సమిష్టిగా పనిచేసి పసుపు జెండా ఖ్యాతిని నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల నాయకులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. వర్చువల్ మహానాడు విజయవంతం కావడంతో క్లస్టర్ 9 పరిధిలో కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది.

## రేపల్లె సబ్ డివిజన్ నగరం మండలంలో ధార్మిక సమావేశం



**చెరుకుపల్లి మండలం మే 27 : (వార్తా ప్రభ ప్రతినిధి)**నగరం గ్రామ ధార్మిక సమావేశం మండల కన్వీనర్ బయ్యన వెంకటరావు ఆధ్వర్యంలో గ్రామ దేవత శ్రీ పక్కలమ్మ తల్లి గుడి ఆవరణలో ఉన్న శ్రీ రామాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా దేవాలయాల ప్రముఖ పొన్నపల్లి సత్యనారాయణ హాజరైయ్యారు. సమరసత సేవ ఫౌండేషన్ ద్వారా నిరంతరం నిర్వహిస్తున్న కార్యక్రమాలన్నీ విజయవంత అవటానికి ఇలాంటి గ్రామ ధార్మిక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వారం వారం భజన కార్యక్రమాలు సత్సంగాలు నగర సంకీర్తనలను సామూహారతులు మరియు పర్వదినాల్లో వచ్చే కార్యక్రమాలన్నీ గ్రామ ధర్మా జట్టు సభ్యుల ద్వారా విజయవంతం చేసి నిర్వహించాలన్నారు. ఈ గ్రామ ధార్మిక సమావేశాల్లో మన హిందూ బంధువులందరూ పాల్గొని మతమార్పిడులను నిరోధించాలన్నారు. శ్రీ హనుమంతుడు శ్రీరామచంద్రమూర్తికి ఎట్లా సేవ చేసాడో అలాగే మన హిందూ బంధువులందరూ మన ధర్మాన్ని కాపాడుకుంటూ హిందూ బంధువులు అందరూ చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె సబ్ డివిజన్ ధర్మ ప్రచారకు చింతల మురళీకృష్ణ గ్రామ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్ కు స్ట్రెక్చర్లు అందజేత

**బక్రీద్ పండగ నాడు ఆదర్శంగా నిలిచిన యువకుడు**



**ఇబ్రహీంపట్నం, మే 27 (వార్తా ప్రభ ప్రతినిధి):** బక్రీద్ పండుగ సందర్భంగా తన తాత జ్ఞాపకార్థం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి 3 స్ట్రెక్చర్లను అందజేశారు ఇబ్రహీంపట్నం కు చెందిన స్నాప్లిక ఈవెంట్స్ అధినేత షేక్ సుభాని. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన తన స్నేహితుడి అత్యవసర చికిత్స సమయంలో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నామని, అలాంటి ఇబ్బందులు మరెవరికి రాకుండా తన వంతు సహాయంగా స్ట్రెక్చర్లు అందజేసినట్టు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆర్భాటాలకు వెళ్లకుండా పదిమందికి ఉపయోగపడేలా స్ట్రెక్చర్లు అందజేసిన సుభాని ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపర్డెంట్ పద్మావతి, అడ్మినిస్ట్రేటర్ అప్పారావు, మంగాదేవి, ప్రముఖ న్యాయవాది నాగ పవన్ కుమార్, సాధనల కిరణ్ కుమార్, చందు, శివ, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

**దళిత ఐక్యవేదిక సభలో రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా**




**ఇబ్రహీంపట్నం, మే 27(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా దళితుల హక్కుల సాధనకు పోరాటాల శరణమని పిలుపునిచ్చారు రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా. బుధవారం నాడు విజయవాడ సుజన కన్వెన్షన్ సెంటర్ లో దళిత ఐక్యవేదిక మహా గర్జనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీలు దళితులు, ముస్లింలు తమ హక్కులు సాధించేందుకు పోరాటం చేయాలని తెలిపారు. చులకన భావంతో కొందరు రాక్షస ప్రవర్తనతో మాత్రమే దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలపై దాడులు జరుగుతున్నాయని, హిందువులకు వీరిపై ఎలాంటి ద్వేషం లేదని అన్నారు. కొంతమంది భయపడి ఎస్సీ హోదా లేకుండా చేసేందుకు మతం ముసుగులో డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. దళితులు ఎస్సీ హోదా కాకుండా రాబోయే కాలంలో రాజ్యాధికారం చేపట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. క్రిస్టియన్లు, ముస్లింలు అన్నదమ్ములని, క్రిస్టియన్లు కష్టంలో ఉన్నప్పుడు సోదరులైన ముస్లింలు అండగా ఉండటం తమ బాధ్యత అన్నారు. క్రిస్టియన్ల హక్కుల సాధనకు నిర్వహించే పోరాటాలకు తాము పూర్తి మద్దతు ప్రకటించి అండగా నిలుస్తామని చెప్పారు

# నియోజకవర్గంలో 79.58 కోట్ల తో నాలాల విస్తీర్ణ పనులు

**ఎమ్మెల్యే అరికపూడి గాంధీ వెల్లడి**



**శేరిలింగంపల్లి,మే 27 (వార్తాప్రభ):** చందానగర్ డివిజన్‌లోని దీప్తి శ్రీనగర్ కాలనీలో పటేల్ చెరువు అలుగు నుంచి గంగారం చెరువు వరకు చేపడుతున్న నాలా విస్తరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. రూ. 18.92 కోట్లతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్, నాలా విస్తరణ నిర్మాణ పనులను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మొత్తం రూ. 79.58 కోట్లతో నాలాల విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పనుల సమయంలో ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధీరజ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం - దెబ్బతిన్న ఇల్లు

## ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న బాధితులు



**జగ్గయ్యపేట మే 27 (వార్తా ప్రభ)** పట్టణ పరిధిలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఏడవ వార్డు ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే పలువురి గృహాలు గాలివాన బీభత్సం దెబ్బతిన్నాయి. 1. కాలనీలో నివాసముండే కే వీరబాబు ఇంటిపై గాలివాన కు పక్కన నివాసం ఉండే ఉప్పె నాగరాజు ఇంటిపై గల వాటర్ ట్యాంక్, రేకులు వీరబాబు ఇంటిపై పడటం వల్ల రేకులు పూర్తిగా దెబ్బతిని ఇంట్లో నివాసముండే వారికి తృటిలో ప్రాణాపాయం తప్పింది, ఇంటి పైకప్పు తో పాటు ఇంట్లోని సామాన్లు పూర్తిగా దెబ్బతినడమే కాకుండా ఆయన భార్య కాళ్లకు గాయాలయ్యాయి.

2. ఉప్పే నాగరాజుకు సంబంధించిన ఇంటి రేకుల పైకప్పు గాలివానకు పూర్తిగా ఎగిరి పక్కింటిపై పడింది, నాగరాజు ఇంట్లో అద్దెకు ఉండే వారి పలు సామాన్లు దెబ్బతిన్నాయి.

3. ఇదే కాలనీ లో నివాసముండే కాసర్ల వెంకమ్మ, షేక్ ఇమామ్ సాహెబ్, మలావత్ సుజాత ల రేకుల పై కప్పులు పూర్తిగా గాలివాన దాటికి ఎగిరిపోయాయి మరియు గృహాల్లోని సామాన్లు ధ్వంశమై ఒక్కొక్క కుటుంబానికి లక్ష నుండి రెండు లక్షల మేర నష్టం జరిగింది.

4. మరియు షేక్ గౌసియా బేగం, సాదుపాటి విష్ణు, సోగాలా మిరియా, దారాదుల మునీరయ్య, చిట్యాల దివ్యభారతి ల గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి మరియు గృహాల్లోని విద్యుత్ పరికరాలు దెబ్బతిని ఒక్కొక్కరికి సుమారు 50 వేల నష్టం వాటిల్లింది.

నష్టపోయిన బాధితులు మాట్లాడుతూ మా పేద కుటుంబాలను అకాలంగా కురిసిన గాలి వాన తమకు నిలువు నీడ లేకుండా చేసిందని రెక్కాడితే డొక్కాడని తమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన తమకు కాలనీలు మంజూరు చేస్తే గృహాలు నిర్మించుకుంటామని నాయకులు, అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వార్డు విఆర్ఓ ఆర్ సుధ నష్టపోయిన గృహాలు సామాన్ల వివరాలు నమోదు చేసుకొన్నారు. నష్టపోయిన బాధితుల వివరాలు పై అధికారులకు రిపోర్ట్ చేస్తామని తెలియజేశారు.

# నేడు వాగ్దేవి మహిళ కళాశాలలో మెగా జాబ్ మేళా




**జగ్గయ్యపేట మే 27 (వార్తప్రభ)** వాగ్దేవి మహిళ కళాశాలలో నేడు గురువారం టాటా ఎలక్ట్రానిక్స్ మల్టీ నేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని. కావున జగ్గయ్యపేట నియోజకవర్గ మహిళా విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొని మంచి ఉద్యోగం ఉపాధి అవకాశాలను పొందవలసిందిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుస్సా సురేష్ వివరించారు. డిగ్రీ పూర్తి అయిన మహిళా విద్యార్థినులు, బిటెక్ పూర్తయిన మహిళా విద్యార్థులలో మాత్రమే ఈ జాబ్ మేళా లో పాల్గొనే అవకాశం కలదని. ఈ జాబ్ మేళా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించబడి సెలెక్ట్ అయిన మహిళా విద్యార్థులకు వెంటనే శాలరీ తో కూడిన ఆఫర్ లెటర్ ఇవ్వటం జరుగుతుందని కావున ఈ అవకాశాన్ని విద్యార్థినిలు వినియోగించుకోగలరని. ఈ జాబ్ మేళా ఆర్టీసీ బస్టాండ్ మున్సిపల్ పార్క్ పక్కనగల వాగ్దేవి కళాశాల లో నిర్వహించబడునని. ఈ మంచి అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కళాశాల కరస్పాండెంట్ బుస సరిత జగ్గయ్యపేట నియోజకవర్గ మహిళా విద్యార్థినుల ను కోరడం జరిగింది

# జగ్గయ్యపేట పట్టణం క్లస్టర్ - 4లో డిజిటల్ మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహణ

**జగ్గయ్యపేట మే 27 (వార్తప్రభ)**నియోజకవర్గం జగ్గయ్యపేట పట్టణ క్లస్టర్ -- 4 పరిధిలో పట్టణంలోని వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన డిజిటల్ మహానాడు కార్యక్రమం క్లస్టర్ ఇంచార్జ్ మైనేని రాధా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట



నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర , మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావు, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి , సామినేని మనోహర్ , సూర్యదేవర ఉషారాణి , గింజుపల్లి వెంకట్రావు , గింజుపల్లి రమేష్, కటికల అనిల్ పాల్గొన్నారు. అలాగే యూనిట్ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, పోలింగ్ బూత్ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, గ్రామ స్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం వంటి అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మహానాడు కార్యక్రమం ద్వారా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీకి మరింత ప్రజాదరణ తీసుకురావాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. డిజిటల్ మహానాడు ద్వారా పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తల్లో మరింత ఉత్సాహం మరియు అవగాహన పెరిగిందని నాయకులు పేర్కొన్నారు.

# ఆకాంక్షిత మండలంలో ఆదర్శ కార్యక్రమం

- మానసిక ఆరోగ్య సేవలను జిల్లా వ్యాప్తంగా విస్తరించాలి
- ఆత్మనిర్భరతకు నైపుణ్య శిక్షణలే బాట
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ఇబ్రహీంపట్నం, మే 27 (వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి, జీవనోపాధి సహాయాన్ని అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ఈ ఆకాంక్షిత మండలంలో కమ్యూనిటీ మెంటల్ హెల్త్ కార్యక్రమాలను అమలు చేయడం ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. కేవలం ఇబ్రహీంపట్నం, జి.కొండూరు మండలాలే కాకుండా జిల్లా మొత్తం మానసిక ఆరోగ్య కార్యక్రమం సేవలు అందించాలని కోరారు. మానసిక సమస్యలకు మందుల ద్వారానే కాకుండా నైపుణ్య శిక్షణలు త్వరగా కోలుకునే దానికి మనసు దృష్టి మళ్లించడానికి ఉపయోగపడతాయని, ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి లో ఏర్పాటు చేసిన రైజ్ సెంటర్ నందు అందించే శిక్షణలు కూడా వినియోగించుకోవాలని సూచిస్తూ, ఇది మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను, మూఢనమ్మకాలను తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తదుపరి బేసిక్ టైలరింగ్ లో నైపుణ్య శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రాజెక్టు లబ్ధిదారులకు రూ. 2,40,000 విలువైన తోపుడు బండ్లు, టీ స్టాల్, కూరగాయల వ్యాపారం, పండ్ల వ్యాపారం, ఫ్యాన్సీ వస్తువుల వ్యాపారం, టైలరింగ్ మెటీరియల్, వంటి జీవనోపాధి సామగ్రిని అందజేశారు. డా. బొల్లినేని కీర్తి మాట్లాడుతూ, వాసవ్య మహిళా మండలి ద్వారా లివ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సహకారం తో 28 మంది సభ్యులకు జీవనోపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. వీటితోపాటు ప్రభుత్వం నుండి అందించే బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల రుణాలు కుటుంబాలకు ఎంతో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం టీం జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో క్యాంప్ నిర్వహించడం ప్రాథమిక స్థాయిలోనే గ్రామ ప్రజలకు మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని అది చాలా ప్రయోజనకరమని అన్నారు. ప్రాజెక్టు పని చేసిన రెండు సంవత్సరాలలో ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందని, మూఢనమ్మకాలు తగ్గి ప్రజలు ఇప్పుడు ఆరోగ్య సేవలను వినియోగిస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఎంపీడీవో డి. శకుంతల మ, ఎమ్మార్వో వై. వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆర్. రామారావు ప్రాజెక్ట్ డైరెక్టర్, వాసవ్య మహిళా మండలి, వీఎంఎం వాలంటీర్లు, సపోర్టు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

# దాములూరులో రెవెన్యూ గ్రామ సభలో గందరగోళం

- వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చడంతో రైతుల అభ్యంతరం
- అధికారులు ఏకపక్షంగా సర్వే చేశారని ఆరోపణలు
- సభ వాయిదా వేసి వెళ్లిపోయిన రెవెన్యూ అధికారులు

**ఇబ్రహీంపట్నం, మే 27 (వార్తా ప్రభ ప్రతినిధి):** రెవెన్యూ రీ సర్వేలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా పేర్కొంటూ తయారు చేసిన ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ రైతులు గ్రామ సభను బహిష్కరించారు. మండల పరిధిలోని దాములూరు గ్రామంలో రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఇటీవల రెవెన్యూ, రీ సర్వే అధికారులు గ్రామంలోని నదీ తీర లంక భూములను రీ సర్వే చేశారు. ఇందులో 129/2ఏ సర్వే నెంబరులో 350 ఎకరాల్లో 283 మంది చిన్న, సన్నకారు రైతులు అన్ని భూ హక్కులతో ఏళ్ల తరబడి వివిధ వంటలు సాగు చేస్తున్నారు. రీ సర్వే సందర్భంగా అందులో 150 ఎకరాలు సాగు భూమిగా, మిగిలిన 200 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా పేర్కొంటూ దస్త్రాలు రూపొందించారు. అలాగే 131వ సర్వే నెంబర్ లో 20 ఎకరాలను సాగుభూమిగా మిగిలిన 180 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా పేర్కొన్నారు. ప్రతిపాదనలు తయారు చేసి రైతుల ఆమోదం కోసం గ్రామ సభలో ప్రవేశపెట్టారు. దీనికి రైతులు తీవ్ర అభ్యంతం తెలిపారు. కొన్ని సంవత్సరాల నుంచి తాము అన్ని హక్కులతో పాస్ పుస్తకాలు పొంది సాగు చేసుకుంటున్న భూములను వ్యవసాయేతర భూములుగా ఎలా పేర్కొంటారని అధికారులను నిలదీశారు. సర్వే సందర్భంగా కనీసం భూ యజమానులకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా సర్వే నిర్వహించి దస్త్రాలను రూపొందించి ఇప్పుడు ఆమోదం తెలపాల్సిందిగా కోరడం సమంజసంగా లేదని వారు అధికారులపై నిరసన వ్యక్తం చేశారు. తాము తరతరాలుగా సాగు చేస్తున్న పంట పొలాలను వ్యవసాయేతర భూములుగా పేర్కొంటే వాటిపై తమకు ఉన్న అన్ని హక్కులు పోయి కనీసం ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు లభించవని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభ రసాభాసగా మారింది. దీంతో తహసీల్దారు వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుని రైతుల అభ్యంతరాలను రాతపూర్వకంగా ఇస్తే ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. దీనికి రైతులు అంగీకరించకపోవడంతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో గ్రామ సభను వాయిదా వేస్తూ రెవెన్యూ అధికారులు వెళ్లిపోయారు.

# మెరుగైన రేపటికోసం సామర్థ్య నిర్మాణం

**అధికారులు, సిబ్బందికి ప్రత్యేక సెషన్లు**
**హెచ్ఆర్‌డీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహణ**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**విజయవాడ, మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెంపు, సమర్థవంతమైన పరిపాలన లక్ష్యంగా అధికారులు, సిబ్బందికి ప్రత్యేక సామర్థ్య నిర్మాణ (కెపాసిటీ బిల్డింగ్) సెషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఒత్తిడి లేని పనివాతావరణంలో నైపుణ్యాల సమర్థ వినియోగం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం–మానవ వనరుల అభివృద్ధి (హెచ్ఆర్‌డీ) సెల్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ పై వర్క్‌షాప్ జరిగింది. సైకాలజిస్టులు డా. జి.శంకర్ రావు, డా. టీఎస్ రావు, బి.నవితశ్రీ, వై.జ్యోతికృష్ణ బృందం



రోజువారీ విధుల నిర్వహణలో ఒత్తిడిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఒత్తిడికి కారణాలు, భౌతిక లక్షణాలు, ఉద్వేగ లక్షణాలు, ప్రవర్తనలో వచ్చే మార్పు, పని ఒత్తిడికి కారణాలు, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్‌పై సెషన్ ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధికారులు తమ సామర్థ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విధానాల అమలు, ప్రజా సేవల మెరుగుదల, కార్యనిర్వహణలో సమన్వయం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సిబ్బందిలో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత పనితీరు, సమస్య పరిష్కార నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, డిజిటల్ స్కిల్స్ తదితరాలను పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# ఏఎస్ పేట ఎస్ఐ గా జిలాని బాధ్యతల స్వీకరణ




**అనుముసముద్రంపేట మే 27 (వార్తాప్రభ ప్రతినిధి)** ఏఎస్ పేట మండల నూతన ఎస్ఐ గా షేక్. జీలాని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సైదులు నెల్లూరు నార్త్ ట్రాఫిక్ కు బదిలీ కాగా ఆత్మకూరు ఎస్ఐ గా విధుల్లో ఉన్న జీలాని ఏఎస్ పేటకు బదిలీపై వచ్చారు. అంతకుముందు ఆయన స్థానికంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. నూతన ఎస్ఐ కు సిబ్బంది ఘనంగా స్వాగతం పలుకుతూ శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా ఏఎస్ పేట ఎస్ఐగా బాధ్యతలు తీసుకోవడం జరిగిందని ముఖ్యంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన దర్గా ఉన్న ఇక్కడ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పోలీస్ నిఘా పెట్టడం తో పాటు గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. అలాగే గంజాయి నియంత్రణ ఆకతాయిలా ఆగడాలుకు అడ్డుకట్ట తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భాస్కర్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.

# జనగణన అనేది దేశ భవిష్యత్తు ప్రణాళికలకు దిక్సూసి.

**గృహాలు గణనను 24 గంటల్లోగా పూర్తిచేసి, పూర్తిస్థాయిలో నివేదిక అందించాలి.**

**జనగణన ఇంటింటికి స్వయంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**



**ఏలూరు/ పెదవేగి, మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పెదవేగి మండలం జగన్నాథపురం గ్రామంలో బుధవారం జనగణన ఇంటింటికి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్వయంగా వెళ్ళి వెరిఫై చేశారు. అనంతరం స్వర్ణగ్రామ సచివాలయంలో సంబంధిత అధికారులు, స్వర్ణగ్రామ ఉద్యోగులతో జిల్లా కలెక్టరు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకున్నవారు, మేము ఇంటికి వెళ్ళినప్పుడు ఐడి నెంబరు ఇవ్వక పోవడంతో, మేము నార్మల్ సెన్సస్ చేశామని, ఇప్పుడు ఐడిలు తక్కువగా ఉన్నాయని చెప్పడంతో జిల్లా కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో ఇంటింటికి వెళ్ళి పూర్తిచేసి, పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జాతీయ జనగణన ప్రక్రియలో అత్యంత కీలకమైన హౌస్ లిస్టింగు జనగణన ప్రక్రియను వెంటనే నూరుశాతం పూర్తిచెయ్యాలని ఆదేశించారు. జనగణన నుండి ఏఒక్కరూ మిస్ కాకుండా అందరినీ సమగ్రంగా నమోదు చెయ్యాలని, మరణాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి పేర్లను తొలగించాలని అన్నారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది చొరవచూపి వెంటనే పూర్తిచెయ్యాలని ఆదేశించారు. ?జనగణన అనేది దేశభవిష్యత్తు ప్రణాళికలకు దిక్సూసి వంటిదని అన్నారు. ఇందులో ఎలాంటి అలసత్వానికి తావు ఇవ్వరాదని, 24 గంటల్లో అన్ని గృహాలు నమోదు ప్రక్రియను పూర్తిచెయ్యాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చెయ్యాలని, మండల అధికారులు ప్రగతిని పర్యవేక్షించాలని అన్నారు. జనగణన సిబ్బంది తమ ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. తప్పుడు సమాచారం ఇవ్వడం గాని, వివరాలు దాచడం గాని చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ?లక్ష్యాలను సకాలంలో చేరుకోని వారిపై, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై నిబంధనలు ప్రకారం కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.భాస్కర్, జిల్లా స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు అధికారి జి.వెంకటనాయుడు, తహశీల్దారు యస్.డి.భ్రమరాంబ, యంపిడివో టి.నాగేంద్రకుమార్, డిప్యూటీ యంపిడివో లు షేక్ మీరా షరీఫ్, కె.రత్నాకరరావు, పంచాయతీ కార్యదర్శి బి.పవన్ హరీష్, సంబంధిత అధికారులు, స్వర్ణగ్రామ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు విజన్ వల్లనే హైదరాబాద్ ఐటీ రంగం ప్రపంచ స్థాయికి ఎదిగింది:ఏం.ఎల్. ఏ. యార్లగడ్డ



**గన్నవరం, మే 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గన్నవరం నియోజకవర్గం క్లస్టర్–5 పరిధిలోని పాత గన్నవరం తిరుపతమ్మ తల్లి కళ్యాణ మండపంలో క్లస్టర్ ఇంచార్జ్ తంగిరాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన హైబ్రీడ్ మహానాడు–2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, మహానాడు పరిశీలకులు మన్నవ మోహన కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహానికి బీఎల్ఏలు, స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్ నాయకులను వేదికపై ఘనంగా సత్కరించారు. అనంతరం చంద్రబాబు ప్రసంగాన్ని స్క్రీన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మహానాడును సంక్రాంతి పండుగలా జరుపుకుంటున్నాయని తెలిపారు. రైతులకు ధాన్యం, డబ్బులు ఇంటికి వచ్చే సమయంలో జరుపుకునే సంక్రాంతి ఎంత వైభవంగా జరుపుకుంటారో, అదే రీతిలో కార్యకర్తలు మహానాడును



జరుపుకుంటున్నారని అన్నారు. ఈసారి హైబ్రిడ్ మోడల్‌లో 1857 క్లస్టర్ల పరిధిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారని, గన్నవరం నియోజకవర్గంలోని 11 క్లస్టర్లలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీకి ప్రత్యేక చరిత్ర ఉందని, 1289 మంది ఎమ్మెల్యేలను, 149 మంది ఎంపీలను, 9 మంది కేంద్ర మంత్రులను, ఒక గవర్నర్‌ను, ఒక లోక్ సభ స్పీకర్‌ను అందించిన పార్టీ ఇదని గుర్తు చేశారు. దేశంలోనే గుర్తింపు పొందిన తొలి ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం అని కొనియాడారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని 44 ఏళ్ల తర్వాత కూడా ఏ పార్టీ తొలగించలేకపోయిందని, ఆయన చేసిన సంస్కరణలు దేశంలో మరే ముఖ్యమంత్రి చేయలేదని అన్నారు. గడిచిన 31 ఏళ్లుగా చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర దిశ మారిందని యార్లగడ్డ పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను 10 రెట్లు పెంచిన ఏకైక నాయకుడు చంద్రబాబు అని ప్రశంసించారు. గత ప్రభుత్వం కేవలం 9000 కోట్ల రూపాయల క్యాపిటల్ ఎక్స్పెండిచర్ మాత్రమే ఖర్చు చేసిందని, కానీ ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 53,000 కోట్ల రూపాయలను కేటాయించిందని తెలిపారు. దీనికి అదనంగా అమరావతి నిర్మాణానికి 58,000 కోట్లతో పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి అమరావతిలోని 29 గ్రామాల్లో తిరిగితే అభివృద్ధి అంటే ఏమిటో తెలుస్తుందని అన్నారు..... అనంతరం మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... గన్నవరం మహానాడుకు పరిశీలకుడిగా రావడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో మహానాడును వినూత్నమైన హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నామని, లక్షలాది మంది వర్చువల్‌గా కనెక్ట్ అవ్వడం గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు మైక్రోసాఫ్ట్, హైటెక్ సిటీ, జీనోమ్ వ్యాలీ వంటివి తెచ్చి హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టారని, ఇప్పుడు లోకేష్ వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు అందించడమే కాకుండా గూగుల్ వంటి దిగ్గజ సంస్థలను రాష్ట్రానికి రప్పిస్తున్నారని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఎకో సిస్టం సిద్ధమవుతోందని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోనే అత్యధికంగా విధ్వంసం జరిగిన నియోజకవర్గాల్లో గన్నవరం ఒకటని, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడ్డారని గుర్తు చేశారు. ఎన్నికల్లో యార్లగడ్డ వెంకట్రావుకు అఖండ మెజారిటీ ఇచ్చి గెలిపించిన కార్యకర్తలకు అండగా ఉంటూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం కేసరపల్లిలో క్లస్టర్–4 ఇంచార్జ్ అన్నే హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన హైబ్రిడ్ మహానాడు, అలాగే తెంపల్లిలో క్లస్టర్–6 కమిటీ నాయకులు తుళ్లిమెల్లి ఝాన్సీ, బండి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన హైబ్రీడ్ మహానాడు, బాపులపాడు లో క్లస్టర్ 8 ఇంచార్జి చిన్నాల లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో వంగల వారి శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్ నందు జరిగిన హైబ్రిడ్ మహానాడు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పుడమితల్లి కడుపు కోత..
# అన్నదాత కన్నీటి వ్యథ..

- కోడూరు దిగువ భూములు ముంపు
- ఏళ్లతరబడి అర్జీలు ఇచ్చినా కరగని అధికారుల హృదయం





**కోడూరు,మే 27 (వార్తాప్రభ) :** పుడమితల్లి కడుపు కోత.. అన్నదాత కన్నీటి వ్యథ" అన్నట్లుగా కోడూరు మండల దిగువ ప్రాంత రైతుల బతుకులు అగమ్యగోచరంగా మారాయి. సుమారు 5 వేల ఎకరాల సారవంతమైన భూములు ప్రతి ఏటా ముంపునకు గురై వేసిన పంట చేతికి రాక, కనీసం నారు పోసుకునేందుకూ వీలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**ముంపునకు రెండు ప్రధాన కారణాలు:**

**(1)శిథిలమైన అవుట్‌ఫాల్ స్లూయిజ్ గేట్లు:** సముద్రపు ఆటుపోట్లను ఆపి, వర్షపు నీటిని బయటకు పంపే అవుట్‌ఫాల్ గేట్లు పూర్తిగా పాడై ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదు. "ప్రతిపాదనలు పంపాం" అని అధికారులు, ప్రజాప్రతినిధులు గత ఆరేళ్లుగా చెబుతున్న మాటే తప్ప, నిర్మాణం ఎప్పటికి జరుగుతుందో నమ్మకం లేని పరిస్థితి.

**(2)అక్రమ తూముల దందా:** రత్నకోడు మెరక కాలువ నుంచి న్యూఇరాలి పల్లపు కాలువలోకి కొందరు ఆక్వా రైతులు అక్రమంగా తూములు వేయడంతో మెరక ప్రాంత నీరంతా నిరంతరం దిగువ రావడం,కారణంగా చిన్నపాటి వర్షానికి సముద్రపు పోట్లకు ఆ నీరు తోడై పొలాలను ముంచెత్తుతోంది. రత్నకోడు మెరక కాలువ సామర్థ్యం, న్యూ ఇరాలి పల్లపు కాలువ సామర్థ్యం పై 20 రెట్లు అధికంగా ఉంటుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు "రత్నకోడు ఉగ్రరూపం మరో కృష్ణ నదిని తలపిస్తుంది."

**ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు:** ఈదుస్థితిపై,కోడూరు,శ్రీరాంపురం,స్వతంత్రపురం దింటిమేరక, యర్రారెడ్డిపాలెం రైతులు, రైతు సంఘ నాయకులు గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా కలెక్టర్, మండల తహసీల్దార్, డ్రైనేజీ శాఖ అధికారులకు అనేక మార్లు అర్జీలు ఇచ్చారు. "సమస్య పరిష్కరించండి మహాప్రభో" అని మొరపెట్టుకున్నారు. బాధితులలో అధిక శాతం బీసీ,స్వలపంగా ఓసీ వెనుకబడిన వర్గ రైతులు ఉన్నారు.

**కలెక్టర్ ఆదేశాలు బుట్టదాఖలు:** రైతుల ఆవేదనను అర్థం చేసుకున్న జిల్లా కలెక్టర్ "తక్షణమే అక్రమ తూములు తొలగించాలి" అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా, క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యం. వ్యవసాయ ప్రాధాన్యతను మరిచి అధికారులు జాప్యం చేస్తూన్నారు.

**ఉన్నత అధికారులు స్పందించాలి:** దివిసీమ రైతులకు జీవనాధారమైన పొలాలు ముంపునకు గురై నిరుపయోగంగా మారుతుంటే చూస్తూ ఊరుకోవడం ధర్మం కాదు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేసి, అక్రమ తూములు తొలగించాలి. అవుట్‌ఫాల్ గేట్లకు తక్షణమే నిధులు విడుదల చేసి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు ముక్తకంఠంతో కోరుచున్నారు.

**సమస్యను పరిష్కరించకపోగా. రైతులపై, రైతు సంఘ నేతలపై ఒత్తిళ్లు :**

బాధాకరమైన విషయం ఏమిటంటే,అధికారులు వారి బాధ్యత నెరవేర్చకపోగా రైతుల మధ్య ద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చిన రైతులను,రైతు సంఘ నేతల వద్దకు కొందరు ఆక్వా రైతులను పంపి "మీ ప్రయత్నాలు మానేయండి" అని ఒత్తిళ్లు చేస్తున్నారని, ఆక్వా రైతుల ప్రయోజనాలే తప్ప, పేద రైతుల కడుపుకోత వారికి పట్టడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల చిన్న కోరిక: గేట్ల నిర్మాణానికి కోట్లు కావాలి. సరే, ఆలస్యమైనా భరిస్తాం. కానీ రత్నకోడు అక్రమ తూముల తొలగింపునకు పెద్దగా ఖర్చు కాదు. అవి తీసేస్తే చాలు, 5 వేల ఎకరాలకు కొంతైనా మేలు జరుగుతుందని బాధిత రైతులు కోరుచున్నారు.

**రైతుల వ్యథ:** వేల రూపాయలు పెట్టుబడి పెట్టినా ఒక్క గింజ పండలేదు.భూమి ఉన్న దన్న పేరే గాని తినడానికి గుక్కెడు గింజలు లేవు. అప్పులు, ఎలా కట్టాలి? పిల్లల్ని ఎలా చదివించాలి?అని బాధిత రైతులు రోదిస్తునారు.

## ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా చర్యలు చేపడతాం - జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్



**అమలాపురం,మే 27 (వార్తాప్రభ) :** ఆక్వా సాగులో రొయ్యల ధరల హెచ్చుతగ్గులను నివారించి,మార్కెట్‌ను క్రమబద్ధీకరించడం ద్వారా ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ .మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించిన ఆక్వారంగ రైతుల ప్రత్యేక సభలో రైతులు తమ ఆవేదనను, ఎదుర్కొంటున్న నష్టాలను కలెక్టరు ఆర్.మహేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైడియా దేవి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ దళారీల వ్యవస్థ, అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల నెపంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు సభ ద్వారా తమ ఆవేదనను విన్నవించారన్నారు. రైతుల విజ్ఞప్తులపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ ?ధరల పర్యవేక్షణ కమిటీ కి నివేదించి రొయ్యల ధరల హెచ్చుతగ్గులను నిరంతరం గమనించడానికి, క్రమబద్ధీకరించడానికి మత్స్యశాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులతో కూడిన ఒక ప్రత్యేక పర్యవేక్షణ కొరకు చర్యలు చేపడతామన్నారు.? కనీస మద్దతు ధర వచ్చేలా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరల ప్రకారమే కొనుగోళ్లు జరిగేలా చూస్తామని, నిబంధనలు ఉల్లంఘించే ప్రాసెసింగ్ ప్లాంట్లు,బయ్యర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.?దళారీల వ్యవస్థలు నియంత్రణ కొరకు చర్యలు గైకొనడం జరుగుతుందని ఆక్వా సాగులో క్వాలిటీ చెకింగ్ పేరుతో రైతులను మోసం చేసే దళారీ వ్యవస్థ పై నిఘా ఉంచుతామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లా ఆర్థిక వ్యవస్థలో ఆక్వారంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రొయ్యల మేత ఎగుమతులు అంశాలను ఒకే కంపెనీ నిర్వహించడంతో ఏకపక్షంగా వ్యవహరిస్తూ తక్కువ రేట్లు కోడ్ చేసి ఆక్వా రైతులను నష్టపరుస్తున్న ట్లు రైతులు ఆవేదనను వెలిబుచ్చారన్నారు. పెట్టుబడి పెట్టి నష్టపోతున్న ఆక్వా రైతును ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ధరల స్థిరీకరణ కోసం ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. రైతులు అధైర్యపడొద్దనీ సమస్యలు పరిష్కరించి అండగా భరోసాగా నిలవడం జరుగుతుందన్నారు. ఈ సభలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ వర్ధన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం. వెంకటరామా రావు, మార్కెటింగ్ శాఖ అధికారులు జిల్లా ఆక్వా రైతుల సంఘం ప్రతినిధు లు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలు..

- ఎముకలు,కీళ్ల పరీక్షలు.
- ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.
- పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి.
- లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి.






**విశాఖపట్నం,మే 27 (వార్తాప్రభ) :** ప్రస్తుత పరిస్దితుల్లో ఎముకలు,కీళ్ల సమస్యలు ఎక్కువ మందికి ఎదురౌతున్నాయాని, అందువల్లే తప్పకుండా ఎముకల సంరక్షణ ఎవరికి వారు తీసుకోవాలని,పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి అన్నారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఉద్యోగుల కోసం ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరం లీ ఫార్మా మరియు లీ హెల్త్ డొమైన్ సంస్థలు, వైజాగ్‌లోని వి.ఐ.పి రోడ్ బ్రాంచ్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యంతో కలిసి మాల్ ఉద్యోగుల కోసం ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ వైద్య శిబిరం ద్వారా సుమారు 130 మందికి పైన ఉద్యోగులు లబ్ధి పొందారు. పాల్గొన్న వారికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు, వాటిలో ప్రధానంగా హ్యాండ్ గ్రిప్ స్ట్రెంత్ (చేతి పట్టు బలం), బి.ఎం.ఐ.(బాడీ మాస్ ఇండెక్స్), హెచ్ బి (హిమోగ్లోబిన్), ఆర్.బి.ఎస్.(రాండమ్ బ్లడ్ షుగర్),బిపి (రక్తపోటు), బోన్ మినరల్ డెన్సిటీ (బిఎండి – ఎముకల సాంద్రత పరీక్ష), బాడీ కంపోజిషన్ అనాలిసిస్ (శరీర నిర్మాణ విశ్లేషణ) పరీక్షల అనంతరం, వైద్యులు మరియు పోషకాహార నిపుణులు (న్యూట్రిషనిస్టులు) రిపోర్టులను పరిశీలించి, ఉద్యోగులకు అవసరమైన ఆహారపు అలవాట్లు మరియు జీవనశైలి మార్పులపై వ్యక్తిగత కౌన్సిలింగ్ ఇచ్చారు. ముఖ్యమైన పార్టిసిపెంట్లు: ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ షాపింగ్ మాల్ ఉద్యోగులు నిరంతరం పని భారంలో ఉంటారని,ఎక్కువ సేపు నిలబడి ఉండటం వల్ల కీళ్ల సమస్యలు,ఎముకలకు ఇబ్బందులు కలుగ వచ్చని,ఇటువంటి పరిస్థితుల్లో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉద్యోగుల కొసమే ఉచిత వైద్య శిబిరం ఎర్పాటు చేశామని లీలారాణి చెప్పారు. సరోజిని మరియు జయలక్ష్మి (క్యాంప్ కోఆర్డినేటర్లు) డాక్టర్ రాధిక మాధురి మరియు క్రాంతి (పోషకాహార నిపుణులు) భాగ్యలత (జి.ఎన్.ఎమ్) మిస్టర్ నవీన్ (రీజినల్ మేనేజర్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్)లీ ఫార్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహానాడు వేడుకలు నిర్వహణ









**నూజివీడు,మే 27 (వార్తాప్రభ) :** నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణ పరిధిలోని 10 క్లస్టర్లలో మహానాడు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి వం-ˇ్యలు కొలుసు పార్థసారథి హాజరై పలు ప్రాంతాల్లో జరిగిన మహానాడు వేడుకల్లో పాల్గొన్నారు. మొదటగా నూజివీడు పట్టణంలోని పోతిరెడ్డిపల్లి జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సైకిల్‌పై ప్రయాణిస్తూ పైడి అప్పారావు కిరాణా మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన మహానాడు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వివాన్ ఫంక్షన్ హాల్, ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామం, కాట్రేనిపాడు గ్రామం, నూజివీడు మండలం తుక్కులూరు, ఆగిరిపల్లి మండలం కొత్త ఈదర గ్రామం, ఆగిరిపల్లి గ్రామాల్లో నిర్వహించిన మహానాడు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహానాడు అనేది తెలుగుదేశం పార్టీకి జెండా పండుగ అని పేర్కొన్నారు. మహానాడులో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గతంలో చేసిన అభివృద్ధి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించి రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు, భావితరాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంటే, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధికి వేదిక మహానాడు అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అనేక ప్రణాళికలు సిద్ధం చేసిందని, భావితరాల అభ్యున్నతి కోసం పలు పరిశ్రమలు స్థాపించనున్నట్లు తెలిపారు. తద్వారా యువతకు సుమారు 8 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని చెప్పారు. అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భావితరాల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కోరారు.

## హనుమాన్ జంక్షన్ లో ఘనంగా హైబ్రీడ్ మహానాడు-2026 కార్యక్రమం

- ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నాయకులు





**హనుమాన్ జంక్షన్,మే 27 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గం క్లస్టర్-8 క్లస్టర్ ఇంచార్జ్ చిన్నాల చిన్నా, హనుమాన్ జంక్షన్ టౌన్ పార్టీ అధ్యక్షులు అట్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన హైబ్రీడ్ మహానాడు-2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు,ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్ నాయకులు వీరమాచినేని వెంకట కృష్ణారావు(బుజ్జి ) తొంటిపాక సత్యన్నారాయణ,నీలం పోతురాజు,తెలుగు యువత అధ్యక్షులు చెరుకూరి హరికృష్ణ లను ఎం ఎల్ ఏ యార్లగడ్డ చేతులమీదుగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విజయా డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు,రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి,స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్య ప్రసాద్,ఆళ్లవెంకట గోపాల కృష్ణ, పుట్టా సురేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెడన నియోజకవర్గం లో మహానాడు

- పసుపు మయమైన వేదికలు
- పాల్గొన్న కాగిత.. బూరగడ్డ



**పెడన,మే 27 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం లో ని నాలుగు మండలాల్లో బుధవారం నాడు మినీ మహానాడు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.స్థానిక శాసన సభ్యుని కార్యాలయంలో పట్టణ మహానాడు రూరల్ లో నందమూరు పెనుమల్లి గూడూరు లో క్లస్టర్ ల వారీగామహానాడు నిర్వహించారు. తొలుతు నాయకులు కీ శే నందమూరి తారక రామా రావు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు.అలాగే పార్టీ పతాకాలను ముఖ్యనాయకులు ఆవిష్కరించారు. శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ బంటుమిల్లి లో బూరగడ్డ కిషన్ తేజ్ గూడూరులో బొడ్డు వేణుగోపాలరావు పట్టణంలో పాల్గొన్నారు.అర్జా నగేష్ సలపాటి ప్రసాద్ శీరం ప్రసాద్ యక్కల శ్యామలయ్య గోపి నాగబాబు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆన్లైన్ వర్చ్యువల్ సమావేశంలో వార్డు ఇంచార్జులు బూత్ కన్వీనర్ లు కార్యవర్గ సభ్యులు వివిధ హోదాలలో గల నాయకులు కార్యకర్తలు అభిమానులు పార్టీ నాయకులు అధ్యక్షుడు చంద్రబాబు ప్రసంగాలతో వివిధ సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు.

## తెలుగువారి పండగల నిర్వహించిన మహానాడు





**పెనమలూరు,మే 27 (వార్తాప్రభ) :** పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని పెనమలూరు మండలం--6 ఇంచార్జ్, మారుపూడి ధనకోటేశ్వర రావు, కంకిపాడు మండలం క్లస్టర్ 7 ఇంచార్జ్ దేవినేని రాజా, క్లస్టర్ 8 ఇంచార్జ్ ఆధ్వర్యంలో 44వ మహానాడు కార్యక్రమాన్ని తెలుగువారి పండగల నిర్వహించారు.వర్చువల్ మహానాడు సమావేశాల్లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, బోడి వెంకట్రామ్ పాల్గొని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మహానాడు కార్యక్రమాల ద్వారా క్లస్టర్ స్థాయిలో పార్టీ మరింత పటిష్టంగా ఎదగాలని, భవిష్యత్ నాయకుడు మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దిశానిర్దేశాలను సమర్థవంతంగా అమలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకత్వంపై ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యకర్తే పార్టీకి అసలైన బలం అనే భావనతో, మహానాడు కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి క్లస్టర్ ఇంచార్జ్, ముఖ్య నాయకుడు, కార్యకర్తకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి మరింత బలంగా చేరేలా ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద్ ప్రసాద్, కంకిపాడు మండల టిడిపి నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ,పులి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కాకమాను రమేష్, సుధాకర్, బొబ్బ శ్రీను, కొడాలి శ్రీకాంత్, కొండవీటి శివయ్య, తుమ్మల జగదీష్ మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188